**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం : 97003 70499

సీనియర్ జర్నలిస్ట్. ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్న వారు వెంటనే సం॥ సెల్ నెం : 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు




చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | శుక్రవారం 21-02-2025 | సంపుటి : 11 | సంచిక : 43 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# ఢిల్లీ సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం

### ప్రమాణం చేయించిన ఎల్జీ వికె సక్సేనా
### హాజరైన ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు
### ఎన్‌డి పక్షాన పలువురు సిఎంలు, డిప్యూటి సిఎంలు హాజరు
### ప్రత్యేక ఆకర్శణగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్







న్యూఢిల్లీ,ఫిబ్రవరి20:దేశ రాజధాని దిల్లీలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. గురువారం మధ్యాహ్నం రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆమెతో ప్రమాణం చేయించారు. 27 ఏళ్ల తర్వాత దిల్లీలో అధికారాన్ని దక్కించుకున్న భాజపా.. ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించింది. దీనికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, భాజపా అగ్రనేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తోపాటు కేంద్రమంత్రులు, ఎన్డీయే కీలక నేతలు, 20 రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మరోవైపు సినీ, పారిశ్రామిక రంగాల పలువురు ప్రముఖులు సైతం విచ్చేశారు. 27 ఏళ్ల తర్వాత ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలు, నేతలు సంబరాల్లో మునిగితేలుతున్నారు. ఉదయం ఇంటినుంచి బయల్దేరిన రేఖాగుప్తా.. హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆమె రామ్‌లీలా మైదానానికి చేరుకొని, అందరినీ పలకరించారు. ఈ కార్యక్రమానికి సాధువులు, పలువురు ప్రముఖులు హాజరుకావడంతో భారీ భద్రత ఏర్పాటుచేశారు. 25,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. రేఖా గుప్తాతో పాటు భాజపా ఎమ్మెల్యేలు పర్వేశ్ వర్మ, ఆశీశ్ సూద్, మజీందర్ సింగ్ సిర్సా, రవీందర్ ఇంద్రజ్ సింగ్, కపిల్ మిశ్రా, పంకజ్ కుమార్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ కొత్త సీఎంకు జడ్ కేటగిరీ సెక్యూరిటీని కేటాయించనున్నారు. హరియాణాలోని జులానాలో 1974 జులై 19న జన్మించిన రేఖా గుప్తా.. దిల్లీ యూనివర్సిటీ పరిధిలోని దౌలత్‌రామ్ కళాశాలలో బీకాం చదివారు. ఆ సమయంలోనే ఏబీవీపీ ద్వారా విద్యార్థి రాజకీయాల్లో ప్రవేశించారు. 1995-96లో దిల్లీ వర్సిటీ విద్యార్థి సంఘం కార్యదర్శిగా పనిచేశారు. 1996-97లో అధ్యక్షురాలిగా సేవలందించారు. మేరఠ్‌లోని చౌధరీ చరణ్‌సింగ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం పట్టా పుచ్చుకొని కొంతకాలం న్యాయవాదిగా పనిచేశారు. 1998లో మనీశ్‌గుప్తాను వివాహం చేసుకున్నారు. 2007లో ఉత్తర పీతంపుర మున్సిపల్ కౌన్సిలర్‌గా విజయం సాధించారు. అనంతరం దక్షిణ దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆరెస్సెస్‌తో ఆమెకు సన్నిహిత సంబంధాలున్నాయి. సంఘ్ మహిళా సంబంధిత కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొనేవారు. ప్రస్తుతం భాజపా మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. భాజపా నుంచి సుష్మాస్వరాజ్, ఉమాభారతి, వసుంధర రాజే, ఆనందీబెన్ పటేల్‌ల తర్వాత ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 5వ మహిళగా, దేశంలో విభిన్న పార్టీల నుంచి సీఎం పదవిని చేపట్టిన 18వ అతివగా రేఖాగుప్తా నిలిచారు.

# పోలవరానికి సత్వర సాయం అందించండి

### కేంద్రమంత్రి పాటిల్‌ను కోరిన చంద్రబాబు



అమరావతి,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ): పోలవరం ఎడమ, కుడి కాలువల నిర్మాణానికి చేసిన ఖర్చును రీయింబర్స్ చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. పోలవరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఏపీకి సంబంధించి పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ భేటీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు. సీఆర్ పాటిల్‌తో ఫలవంతమైన సమావేశం జరిగిందని అన్నారు. పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 200 టీఎంటీల వరద నీరు గోదావరిలోని పోలవరం నుంచి బనకచర్లకు పంపేందుకు లింక్ కెనాల్ ఏర్పాటుపై చర్చించామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే ఏపీ కరువు రహితంగా మారడంతో పాటు 80 లక్షల మందికి తాగునీరు అందిస్తుందని వివరించారు. 3 లక్షల హెక్టార్ల నూతన ఆయకట్టు ఏర్పాడుతుందని అన్నారు. 9.14 లక్షల హెక్టార్లకు ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. 20 టీఎంసీలు నీరు పరిశ్రమలకు అందించగలుగుతామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఢిల్లీ సిఎం ప్రమాణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన

### పవన్ కళ్యాణ్ వస్త్రధారణపై మోడీ ఆశ్చర్యం
### హిమాలయాలకు వెళుతున్నారా అంటూ...సెటైర్లు
### నవ్వులు పూయించిన మోడీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,ఫిబ్రవరి20: దేశ రాజధాని హస్తినలో ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వేషధారణ చూసి ప్రధాని మోడీ ఆశ్చ పోయారు. సన్యాసం పుచ్చుకుని హిమాలయాలకు వెళుతున్నారా అంటూ చమత్కరించారు. ఢిల్లీ సిఎం ప్రమాణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాల కీలక నేతలు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పవన్ కళ్యాణ్ దీక్షలో ఉండటంతో ప్రత్యేక దుస్తులతో ఈ కార్యక్రమంలో కనిపించారు. ప్రధాని మోదీ వేదికపైకి రాగానే అక్కడున్న నేతలను పలకరించారు. తొలుత గోవా సీఎం ప్రమోద్ సావంత్, ఆ తరువాత మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు నమస్కరిస్తూ ముందుకు సాగిన మోదీ, ఆ తర్వాత మహారాష్ట్ర మరో డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను పలకరించారు. ఆ తర్వాత ఫడ్నవీస్‌తో పాటు మిగతా ఎన్డీయే భాగస్వామ్య పక్షాలకు నమస్కరించుకుంటూ ముందుకుసాగిన మోదీ.. పవన్ కళ్యాణ్ కనిపించగానే ఒక్కనిమిషం పాటు అలా ఆగిపోయారు. పవన్ వస్త్రాదారణ చూసిన మోదీ నవ్వుతూ హిమాలయాలకు వెళ్దామనుకుంటున్నావా అంటూ చమత్కరించారు. మోదీ మాటలకు పడిపడి నవ్విన పవన్ కళ్యాణ్ అలాంటిదేమి లేదంటూ సమాధానమిచ్చారు. వెంటనే నీ ముందు చాలా బాధ్యతలు ఉన్నాయి.. వాటిని చూసుకో అంటూ మోదీ పవన్ కళ్యాణ్ చేతిలో చేయి వేసి పలకరించారు. మోదీ మాటలకు పవన్ కళ్యాణ్ వెనుక ఉన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సైతం నవ్వుతూ కనిపించారు. వేదికపై ఉన్నవారందరికి నమస్కరిస్తూ ముందుకుసాగిన మోదీ పవన్ వద్ద కొద్దిసేపు ఆగి.. ప్రత్యేకంగా మాట్లాడటంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పవన్‌పై మోదీ మరోసారి తన అభిమానాన్ని చూపించారంటూ జనసైనికులు కామెంట్స్ చేస్తున్నారు. అయితే వేదికపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన వస్త్రధారణ చూసి పీఎం మోదీ సైతం ఆశ్చర్యపోయినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం కోసం మాట్లాడుతున్నారు.

# ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా విజేందర్ గుప్తా

### ఎంపిక చేసిన బిజెపి అగ్ర నాయకత్వం



న్యూఢిల్లీ,ఫిబ్రవరి20(ఆర్ఎన్ఎ):దేశ రాజధాని దిల్లీలో భాజపా ప్రభుత్వం కొలువుదీరగా, అసెంబ్లీ స్పీకర్‌గా రోహిణి నియోజకవర్గం నుంచి గెలిచిన విజేందర్ గుప్తా ను పార్టీ ఎంపిక చేసింది. దిల్లీ అసెంబ్లీ స్పీకర్‌గా పార్టీ తనను ఎంపిక చేయడంపై విజేందర్ గుప్తా హర్షం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో ఆయనకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. దాదాపు 10 ఏళ్ల క్రితం అసెంబ్లీ నుంచి ఆయన బహిష్కరణకు గురయ్యారు. తాజాగా ఆయన అదే సభకు స్పీకర్‌గా ఎంపిక కావడం గమనార్హం. 2015లో దిల్లీ అసెంబ్లీలో ఆప్ ఎమ్మెల్యే ఆల్కాలంబాపై మరో ఎమ్మెల్యే ఓపీ శర్మ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో సభలో ఒక్కసారిగా ఆందోళనలు చెలరేగాయి. ఇందులో పాల్గొన్న భాజపా ఎమ్మెల్యే అయిన విజేందర్ గుప్తాను అప్పటి స్పీకర్ ఆరోజు సాయంత్రం 4 గంటల వరకు సభ నుంచి బహిష్కరించారు. అయితే బయటకు వెళ్లేందుకు ఆయన నిరాకరించడంతో.. మార్షల్స్ గుప్తాను భుజాలపై ఎత్తుకొని అసెంబ్లీ నుంచి బయటకు తీసుకెళ్లారు. తాజాగా దీనికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయ్యాయి. ఇదిలాఉంటే.. రామ్‌లీలా మైదానంలో గురువారం వేల మంది ప్రజల సమక్షంలో దిల్లీ సీఎంగా రేఖా గుప్తా ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు ఎన్డీయే నేతలు, పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు హాజరయ్యారు. భాజపా పాలిస్తున్న 14 రాష్ట్రాల్లో ఎక్కడా మహిళా ముఖ్యమంత్రి లేకపోవడంతో పార్టీ అధిష్ఠానం రేఖాగుప్తా వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది


# ప్రజల కోసం అసెంబ్లీకి పోతారా లేదా

### ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తారా లేదా
### ప్రజలు ఎన్నుకున్నది ఇంట్లో కూర్చోవడానికి కాదు
### వైసిపికి సవాల్ విసిరిన పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల

విజయవాడ,ఫిబ్రవరి20: అసెంబ్లీకి వెళ్లే అంశంపై వైసీపీ పాలసీ ఏంటో చెప్పాలని పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. అసెంబ్లీలో ప్రజల పక్షాన పోరాడుతారా లేదా చెప్పాలన్నారు. వైసీపీ సభ్యులు అసెంబ్లీకి వెళ్లకపోతే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇంట్లో కూర్చొని ప్రెస్ మీట్‌లు పెట్టడానికి కాదు ప్రజలు మీకు ఓట్లు వేసిందని విమర్శించారు. దమ్ముంటే తమ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని వైఎస్ షర్మిల సవాల్ విసిరారు. వైసీపీ నేత బొత్స సత్యనారా యణపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు ఖాళీగా ఉన్నది ఎవరో, రాష్ట్ర సంపదను పందికొక్కుల్లా తిన్నది ఎవరో రాష్ట్ర ప్రజానీకానికి తెలుసని విమర్శించారు.

# కూటమి నేతల్లో ఎక్కడా సమన్వయ లోపం లేదు

### వెన్ను నొప్పి కారణంగానే కొన్నికార్యక్రమాలకు దూరంగా ఉన్నా
### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాం
### ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ స్పష్టీకరణ



న్యూఢిల్లీ,ఫిబ్రవరి20:ఏపీలో మూడు పార్టీల నేతలు సమన్వయంతోనే కలిసి ముందుకు వెళుతున్నట్టు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో సిఎం రేఖాగుప్తా ప్రమాణ స్వీకారానికి గురువారం హాజరైన ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వెన్ను నొప్పి కారణంగానే రాష్ట్రంలో కొన్ని సమావేశాలకు హాజరుకాలేకపోయానని.. ఇప్పటికీ వెన్ను నొప్పి తీవ్రంగా బాధిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. ఏపీని జగన్ అప్పుల కుప్పగా మార్చారని.. అందువల్ల ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని వెల్లడించారు. అయినా ఇచ్చిన హామీలు అమలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామన్నారు. పర్యావరణ, అటవీ శాఖలు తనకు చాలా ఇష్టమైన శాఖలని.. నిబద్ధతతో తన మంత్రిత్వశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మధ్య ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కొన్ని సమావేశాలకు దూరంగా ఉండడంపై సోషల్ మీడియాలో పలు రకాల చర్చలు జరుగుతున్నాయి.. అయితే, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రమాణస్వీకారానికి.. ఎన్డీఏ సమావేశానికి హాజరైన పవన్ కళ్యాణ్.. మీడియా చిట్‌చాట్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు.. ఏపీలో సమన్వయంతోనే కలిసి ముందుకు వెళున్నామని స్పష్టం చేశారు. వెన్ను నొప్పి కారణంగానే ఏపీలో కొన్ని సమావేశాలకి హాజరుకాలేకపోయానన్న ఆయన.. ఇప్పటికీ వెన్ను నొప్పి తీవ్రంగా బాధిస్తోందన్నారు.. ఢిల్లీ సీఎం ప్రమాణస్వీకారం వేదికపై ఎన్డీఏ నేతలను అందరినీ పలకరిస్తూ ముందుకు సాగిన ప్రధాని మోడీ.. ఏపీ డిప్యూటీ సీఎంను ప్రత్యేకంగా పలకరించారు..

# సంపాదకీయం

శుక్రవారం 21-02-2025

## పొంచి ఉన్న మరో మహమ్మారి

గులియన్ బారీ సిండ్రోమ్ (జిబిఎస్)? లక్షమందిలో ఒకరిద్దరికి మాత్రమే సోకే ఒక వ్యాధి పేరు ఇది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానాతోపాటు, దక్షిణాది రాష్ట్రాలను ఈ మహమ్మారి వణికిస్తోంది. పాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తోంది. అంటువ్యాధి కానప్పటికీ, అరుదుగా సోకే వ్యాధే అయినప్పటికీ ఇది సోకితే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉండటంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమై, వ్యాధి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాయి. కలుషితమైన నీరు, ఆహారం కారణంగా సోకే జిబిఎస్ సాధారణంగా పెద్దవారిపై మాత్రమే ప్రభావం చూపిస్తుంది. అయితే ఇటీవల బయటపడిన కొన్ని కేసులలో పిల్లలకూ ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ కావడమే ఇప్పుడు కలవరం కలిగించే అంశం. ఢిల్లీలో వంద కేసులు వెలుగు చూడగా, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే 60 మంది ఈ వ్యాధి బారినపడ్డారు. ఒకే రోజు 11 కేసులు వెలుగు చూడటం వెన్నులో వణుకు పుట్టిస్తోంది. యాభై మంది జిబిఎస్ బారినపడ్డారనీ, వీరిలో ఇద్దరు మృతి చెందారని స్వయంగా ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యమంత్రి ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తాజాగా తెలంగాణలోనూ జిబిఎస్ కాలు మోపినట్లు నిర్ధారణ అయింది. సిద్దిపేట జిల్లాకు చెందిన ఒక మహిళ జిబిఎస్ బారినపడి కన్నుమూయడంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఉదర సంబంధిత వ్యాధులకు కారణమయ్యే కాంపైలోబాక్టర్ జెజునీ అనే బ్యాక్టీరియాయే గులియన్ బారీ సిండ్రో మ్‌కూ కారణమవుతోంది. వైద్య పరిభాషలో ఇది ఒక ఆటో ఇమ్యూన్ వ్యాధి. కలుషిత నీరు, ఆహారంతో ఉదరంలోకి వ్యాధికారక బ్యాక్టీరియా ప్రవేశించి, తన ప్రతాపాన్ని చూపిస్తుంది. విరేచనాలు, కడుపు నొప్పి, నీరసంతో మొదలై, రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీయడం ఈ వ్యాధి ప్రత్యేకత. శరీరంలో ఉండే యాంటీబాడీలు సొంత కణజాలాలపైనే దాడి చేసి, నిర్వీర్యం చేస్తాయి. ఫలితంగా నాడీ వ్యవస్థ పనిచేయక, కండరాలు చచ్చుబడతాయి. సకాలంలో గుర్తించి చికిత్స పొందితే బతికి బయటపడే అవకాశం ఉన్నా, ఆలస్యం జరిగితే రోగిని వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. బ్యాక్టీరియా, వైరల్ ఇన్ ఫెక్షన్ల కారణంగా రోగనిరోధక శక్తి క్షీణించినవారికి జిబిఎస్ త్వరగా సోకుతుందన్న వైద్యుల హెచ్చరికలు నిర్లక్ష్యం చేయడానికి వీలులేదు. గులియన్ బారీ సిండ్రోమ్ ప్రబలడానికి కుంభమేళా కూడా ఒక కారణం కావచ్చునని ఆయా రాష్ట్రప్రభుత్వాలు అనుమానిస్తున్నాయి. కోట్లాది మంది భక్తులు తరలివచ్చి స్నానాలు ఆచరిస్తూ ఉండటంతో నదీ జలాలు కలుషితమై జిబిఎస్ సోకుతోందన్న వైద్యనిపుణుల మాటలను కొట్టిపారేయలేం. మహారాష్ట్ర సరిహద్దుల్లో కర్ణాటకకు చెందిన రెండు గ్రామాల ప్రజలు ఈ వ్యాధికి గురికావడంతో ఆరా తీయగా ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లివచ్చిన కొందరు గ్రామస్థులు జిబిఎస్ బారిన పడినట్లు తేలింది. కాబట్టి ప్రయాగ్‌రాజ్ సహా, గంగానదీ తీర ప్రాంతాల్లో జలశుద్ధికి చర్యలు తీసుకోవడం తక్షణావసరం. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు గులియన్ బారీ సిండ్రోమ్ వ్యాధి గురించి, వ్యాధి లక్షణాల గురించి అవగాహన కలిగించడం మరీ ముఖ్యం. లేనిపక్షంలో విరేచనాలు, నీరసమే కదాని సొంత వైద్యం చేసుకుని ప్రాణాల మీదకు తెచ్చుకునే ప్రమాదం ఉంటుంది. తీర్థయాత్రలకు వెళ్లి స్వస్థలాలకు చేరుకున్నవారు తమలో ఈ వ్యాధి లక్షణాలు గమనిస్తే, తక్షణమే వైద్యులను సంప్రదించడం మేలు. జిబిఎస్‌కు చికిత్స ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడం గమనార్హం. ఈ వ్యాధికి వినియోగించే ఇమ్యునో గ్లోబ్యులిన్ ఇంజెక్షన్ల ఖరీదు 30 వేల రూపాయల పైమాటే. పైగా ఈ ఇంజెక్షన్లను రోజుకు మూడు చొప్పున ఇవ్వవలసి ఉంటుంది. పేద ప్రజానీకం ఇంతటి ఖర్చును భరించే పరిస్థితి ఉండదు కాబట్టి ప్రభుత్వాలు ముందుకు వచ్చి, ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు, ఇంజెక్షన్లు నిల్వ ఉండేలా చూడాలి. మొక్కై వంగనిది మానై వంగదంటారు. ఇప్పుడిప్పుడే దేశమంతటా వ్యాపిస్తూ, తన ప్రతాపాన్ని చూపిస్తున్న ఈ మహమ్మారి వ్యాధి కోరలు పెరికివేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్కతాటిపైకి వచ్చి, యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే, కరోనా ఇది కూడా ప్రజల ప్రాణాలను పెద్ద సంఖ్యలో కబళించే ప్రమాదం ఉంటుంది. తస్మాత్ జాగ్రత్త!

# వారెవ్వా హైడ్రా..!



హైదరాబాద్, ఫిబ్రవరి 20, హైదరాబాద్‌లో దశాబ్దాల చరిత్ర కలిగిన చెరువులను ఆక్రమణ కోరల నుంచి రక్షించే మహా సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా యాక్షన్ మొదలైన తొలిరోజుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఎంతలా అంటే హైడ్రా హైస్పీడ్ యాక్షన్ ఏకంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవ్వడమే కాదు, ప్రతిపక్షాలకు పోరాట అస్త్రాలను ఇచ్చింది. హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్ నేతృత్వంలో మొదటి నుంచి వేసిన ప్రతీ అడుగూ వివాదమే అయింది. ప్రతీ కూల్చివేతలో రాజకీయ రాద్ధాంతమే జరిగింది. నాగార్జున ఎన్‌కన్వెషన్ మొదలు బడా బాబుల భవంతులు, పేరు మోసిన నిర్మాణాల వరకూ ఎవర్నీ వదల్లేదు హైడ్రా. మీడియా ఉతికి ఆరేసినా, ప్రతిపక్షాలు ఏకిపారేసినా.. డోన్ట్ కేర్ అంటూ హైస్పీడ్ బుల్డోజర్‌లా దూసుకెళ్లింది. హైడ్రాకు హైకోర్టు బ్రేక్‌లు వేసింది. సెలవురోజుల్లో కూల్చివేతలు ఎందుకంటూ నిలదీసింది. నలువైపుల నుంచి వచ్చిన విమర్శలు ప్రభుత్వంపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా హైడ్రా స్పీడ్ తగ్గింది. వ్యూహం మారింది. ఇప్పుడు ఆచి తూచి అడుగులేస్తూ యాక్షన్‌లోకి దిగుతోంది. హైడ్రా కూల్చివేతల వల్ల ఎంతో మంది ఇళ్లు కోల్పోయారు. భారీ భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. ఇంత జరుగుతున్నా హైడ్రా మాత్రం మా లక్ష్యం చెరువుల పునరుద్ధరణ, భావితరాల భవితవ్యం అంటూ చెప్పుకొస్తోంది. నేటికి అదే సంకల్పంతో ముందుకు సాగుతోంది. తాజాగా జరిగిన ఓ ఘటన హైడ్రా లక్ష్యం సరైనదే, విమర్శలను ఎదిరించిన చేసిన పనిలో న్యాయమైందే అని నిరూపించింది. బతుకమ్మ కుంట చెరువు హైడ్రా చర్యలను సమర్థించింది.

### విమర్శల నుంచి ప్రసంశలవైపుగా పయనం!

అంబర్‌పేట మండలంలోని బాగ్ అంబర్ పేటలో ఉన్న బతుకమ్మ కుంట చెరువు దాదాపు ఎనభై శాతంపైగా ఆక్రమణకు గురైంది. 16 ఎకరాలు చెరువు కాస్తా 5 ఎకరాలకు వచ్చింది. అది కూడా పూర్తిగా ముళ్లకంచెలతో నిండిపోయి. దీన్ని కూడా కబ్జాదారులు హస్తగతం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో స్థానికులు సమస్యను హైడ్రాకు చేరవేశారు. మా బతుకమ్మ కుంటను బతికించండి అంటూ వేడుకున్నారు. రంగంలోకి దిగిన హైడ్రా బుల్డోజర్‌లు ఈసారి చెరువు ఆక్రమించి ప్రాంతాన్ని వదిలేసి మిగతా ప్రాంతంలో ముళ్లకంచెలు తొలిగించేందుకు రెడీ అయింది. అలా బుల్డోజర్లు భూమిని తాకగానే గంగమ్మ ఉబికి వచ్చింది. ఇన్నాళ్లు నన్ను మింగిన ఆక్రమణలు, కబ్జా తిమింగలాల నుంచి రక్షించడానికే వచ్చావా హైడ్రా అంటూ ఆనందంతో పరవళ్లు తొక్కింది. ఇక్కడ చెరువు లేదు అన్నవాళ్ల నోళ్లు మూయించేలా బతుకమ్మకుంటలో దాగిన నిజం వెలుగులోకి వచ్చింది. తొలిరోజుల్లో హైడ్రా అయితే చెరువు ఆక్రమించి కట్టిన ఇళ్లు కూల్చివేసి 16 ఎకరాల చెరువును వెలుగులోకి తెచ్చేది కానీ మారిన హైడ్రా అలాంటి సాహసం చేయలేదు. మిగలిన 5 ఎకరాలు బాగుచేసి చెరువును సుందరీకరణ చేసే పనిలో నిమగ్నమైంది. ఈ బతుకమ్మ కుంట చెరువు వద్ద ఉబికి వచ్చిన నీరు అనేక ప్రశ్నలకు సమధానం మాత్రమే కాదు... హైడ్రాను తిట్టిపోస్తున్న గొంతుకులకు ఆనకట్ట కట్టింది. హైడ్రా అన్ని చెరువులను రక్షిస్తే, పాతాళంలో దాగిన భూగర్భ జలాలు పైకి ఉబికి కుంటలు, చెరుల కొత్త జీవం పోసుకుంటే ఓసారి ఊహించండి. భారీ వర్షాలకు ముంపు అనే మాట కనుచూపుమేరలో వినపడదు. తాగునీటి సమస్యకు సైతం పరిష్కారం చూపడమేకాదు, భావి తరాలకు బంగారు భవిష్యత్ ఇవ్వొచ్చు. ఇదే కదా హైడ్రా చెప్పింది అని కొందరు అభిప్రాయపడుతున్నారు. అదేకదా ఇప్పుడు బతుకమ్మ కుంటతో రుజువైందని అంటున్నారు. అందుకే విమర్శించిన గొంతులు సైతం ఇప్పుడు వారెవ్వా హైడ్రా అంటున్నాయి.

# రియల్...ఢమాల్

హైదరాబాద్, ఫిబ్రవరి 20, హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కొంత కుదుపుకు లోనవుతుంది. కొనేవారు లేక అనేక వెంచర్లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. గతంలో వెంచర్ ప్రారంభానికి ముందే అడ్వాన్స్ బుకింగ్ తో మొత్తం అమ్ముడుపోయేవని, ఇప్పుడు ప్రీ బుకింగ్స్ లేకపోగా నిర్మాణాలు కూడా పూర్తయిన ఫ్లాట్లను కొనుగోలు చేసే అవకాశం కనిపించడం లేదని రియల్ ఎస్టేట్ రంగం నిపుణులు చెబుతున్నారు. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గిపోయిందా? హైడ్రా దెబ్బకు హడలెత్తిపోయి కొనుగోలు చేయడం లేదా? అన్నది స్పష్టత లేకపోయినా కొనుగోళు తగ్గిపోవడంతో కొందరు బిల్డర్లు బలవన్మరణానికి కూడా పాల్పడుతున్నారు. ఇలా హైదరాబాద్ నగరంలో అనేక వెంచర్లు కొనేవారు లేక వెలవెల బోతున్నాయి. ముందుగా నిర్మాణాలు పూర్తయిన కొన్ని ప్రముఖ సంస్థలు ఆఫర్లు కూడా భారీగానే ప్రకటిస్తున్నాయి. ఇంటీరియర్ ఫ్రీ అంటున్నాయి. మాడ్యులర్ కిచెన్ ఫ్రీ గా చేస్తామని చెబుతున్నాయి. పార్కింగ్ ఉచితం అని చెబుతున్నారు. కొన్ని నిర్మాణ సంస్థలయితే రిజిస్ట్రేషన్ ఫీజు లో కూడా రాయితీలను ప్రకటిస్తున్నాయి. అయినా కొనేనాధుడే కరువయ్యారు. మరొకవైపు ఎన్‌ఆర్‌ఐలు ఎక్కువగా పెట్టుబడి పెట్టేవారు. అక్కడ ఉండి ఇక్కడ ఆస్తులను కొనుగోలు చేసేవారు. కానీ వారు కూడా హైడ్రా నిబంధనలు ఎంత మేరకు అప్లయ్ అవుతాయో? ఏ బిల్డర్ ను నమ్మాలన్నది తెలియక కొనడం మానేశారు. దీంతో వారి సొంత ఊళ్లలో వ్యవసాయ భూమి కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు. ఇక కొనడం కష్టమే మూడు నెలల్లో... మరోవైపు కొత్తగా ఉద్యోగాలు సంపాదించుకుని అమెరికాలో స్థిరపడిన వారు కూడా ఎక్కువ మంది కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చేవారు. అమెరికా వెళ్లి సంపాదన మొదలవ్వగానే హైదరాబాద్ లో సొంత ఇంటిని కొనుగోలు చేయడం ఒక అలవాటుగా మార్చుకునే వారు. కానీ ఇప్పుడు ట్రంప్ రాకతో ఉన్న ఉద్యోగాలు ఊడిపోయే పరిస్థితి వచ్చింది. పార్ట్ టైం ఉద్యోగాలు కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. దీంతో అటువంటి వారు కూడా కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో హైదరాబాద్‌లో 22శాతం ఇళ్ల అమ్మకాలు పడిపోయాయి. గత మూడు నెలల్లో అమ్ముడు పోయింది కేవల పదహారు వేలు మాత్రమేనట.

# రేషన్ కార్డుల పంపిణీనికి అధికారులు చర్యలు



హైదరాబాద్, ఫిబ్రవరి 20, తెలంగాణలో రేషన్ కార్డుల పంపిణీనికి అధికారులు చర్యలు చేపట్టారు. ఒకట్రెండు రోజుల్లో కీలక నిర్ణయం కూడా రానుంది. ఇప్పటికే కార్డు ఎలా ఉండాలనే విషయంపై ప్రభుత్వం ఓ క్లారిటీకి వచ్చినట్టు సమాచారం. డిజైన్‌ను ఓకే చేశారని టాక్ నడుస్తోంది. బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నట్టు ప్రధానమంత్రి ఫొటో మాత్రం పెట్టలేదని సమాచారం. చివరి నిమిషంలో ఏదైనా నిర్ణయం తీసుకుంటే తప్ప ప్రస్తుతానికి మాత్రం మోదీ ఫొటో లేకుండా కేవలం రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలు మాత్రమే ఉన్నట్టు తెలుస్తోంది. దీనిపై బీజేపీ నేతలు ఎలా ఫైట్ చేస్తారో అన్న ఆసక్తి నెలకొంది. కార్డును కూడా చాలా భిన్నంగా డిజైన్ చేసినట్టు చెబుతున్నారు. గతంలో చేసినట్టు పెద్దగా చేయకుండా చిన్న ఏటీఎం కార్డులా డిజైన్ చేశారని అంటున్నారు. అందులోనే అందరి పేర్లు వచ్చేలా అని వివరాలు ఉండేలా స్మార్ట్ కార్డు మాదిరిగా ఉంటుంది. దీనిపై ఓ క్యూఆర్ కోడ్ కూడా ఉంటుందని బోగట్టా. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు. అందుకే లక్షల్లో జనం ఈ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. అందరికీ ఒకేసారి కార్డులు ఇవ్వాలంటే సమయం పడుతుంది. స్మార్ట్ కార్డులు అయితే త్వరగా ఇవ్వొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. దీంతోపాటు ఈ రేషన్ కార్డు వినియోగించుకొని మోసాలు చేసే వారికి చెక్ పెట్టాలని చూస్తోంది. నకిలీ బెడద లేకుండా, పక్కదారి పట్టకుండా తప్పు జరగకుండా ఈ స్మార్ట్ యూజ్ అవుతుందని అంచనా వేస్తోంది. వీటన్నింటికీ తోడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా కీలక ముందడుగు వేశామని కూడా చెబుతోంది. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఆయా జిల్లాల్లో కాకుండా కోడ్ లేని జిల్లాల్లో పంపిణీనికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతానికి తెలంగాణలో కోడ్ లేని జిల్లాలు మూడే ఉన్నాయి. ఉమ్మడి హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో లేదు. అందుకే ఆ జిల్లాల్లో రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు సిద్ధమవుతున్నారు. మొదటి విడతలో ఒక్కో జిల్లాకు లక్ష కార్డులు పంపిణీ చేయబోతున్నారు. ఈ మేరకు ప్రింటింగ్ పనుల?లో అధికారులు బిజీగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మూడు జిల్లాలు అయ్యేసరికి ఎన్నికల కోడ్ తొలగిపోతుందని ఆ తర్వాత మిగతా రాష్ట్రమంతటా కార్డులు పంపిణీ ముమ్మరం చేస్తామని చెబుతున్నారు. రేషన్ కార్డుల అప్లికేషన్లు, రద్దీ, పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పౌరసరఫరాల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్రామసభలు, మీ సేవా కేంద్రాలు, కుల గణన ద్వారా వచ్చిన దరఖాస్తులను వీలైనంత త్వరగా ప్రోసెస్ చేయాలని చెప్పారు. ఎక్కడా డూప్లికేషన్‌కు అవకాశం లేకుండా జాప్యం జరగకుండా జాగ్రత్త పడాలన్నారు. అదే టైంలో అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వాళు మరోసారి అప్లై చేయకుండా అవగాహన కల్పించాలని చెప్పారు.

### జిల్లాకు లక్ష చొప్పున పంపిణీకి సిద్ధం

తెలంగాణలో త్వరలోనే రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలు కానుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో పంపిణీ చేయాలని ఇప్పటికే ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్త కార్డులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ముందుగా జిల్లాకు లక్ష కార్డులు చొప్పున పంపిణీ చేయనున్నారు. కొత్తగా రూపొందించి రేషన్ కార్డులు ఏటీఎం కార్డు మాదిరిగా ఉండబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఫొటోతో ఈ కార్డులు వస్తాయని అంటున్నారు. ఈ కార్డులు చాలా స్మార్ట్‌గా ఉంటుందని దానిపై ఓ క్యూఆర్ కోడ్ కూడా ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్ వల్ల ఆ కార్డు వివరాలు వెంటనే తెలుసుకునే వీలుంటుందని అంటున్నారు. ఏటీఎం కార్డులా ఉంటే క్యారీ చేయడం సులభం అవుతుందని చెబుతున్నారు. జేబులో పెట్టుకొని క్యారీ చేయడానికి వీలు అవుతుందని వెల్లడించారు. త్వరగా చినిగిపోదని మన్నిక ఎక్కువగా ఉంటుందని అంటున్నారు. ఆ కార్డు వివరాలు త్వరగా తెలుసుకునేందుకు దానిపై క్యూఆర్ కోడ్ కలిగి ఉంటుమంది. ఈ కార్డులో ఎడమ వైపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫొటో ఉంటుంది. కుడివైపున పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటో ఉంటుంది. మధ్యలో తెలంగాణకు చెందిన లోగో ఉంటుంది. ఇందులో ముందు వైపు కుటుంబ సభ్యులు వివరాలు ఉంటాయి. వారి పేర్లు, వయసు, పుట్టిన తేదీలు ఉంటాయి. అంతేకాకుండా దాని వెనుకాల లబ్ధిదారుడి పేరు చిరునామా, రేషన్ దుకాణం వివరాలు కూడా ముద్రిస్తారు. డీలర్ కాంటాక్ట్ నెంబర్, రేషన్ షాపు సమయాన్ని ముద్రిస్తారు. దీన్ని బయోమెట్రిక్‌తో అనుసంధానించనున్నారు. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు అంశంపై రివ్యూచేశారు. గతంలో చాలా వేదికపై దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తే ఇంకా ఎందుకు మీ సేవ కేంద్రాల వద్ద జనం ఎగబడుతున్నారని అధికారులను ప్రశ్నించారు. అప్లై చేసిన వాళ్లే పదే పదే చేస్తున్నారని అందుకే మీ సేవ కేంద్రాల వద్ద పరిస్థితి గందరగోళంగా ఉందని తెలిపారు. మీ సేవ కేంద్రాల వద్ద రద్దీ తగ్గించి ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారులకు కార్డుల పంపిణీ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకోడ్ అమలులోఉన్నందునవాటిని తప్పించాలని సూచించారు. కోడ్ అమలులో లేని జిల్లాల్లో పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తైనందున ఆయా గ్రామాలకి కూడా లిస్ట్‌లు వెళ్లిపోయాయి. ఆన్‌లైన్‌లో కూడా లిస్ట్‌లో పేర్లు చూసుకునే వెసులుబాటు కల్పించారు. ఒకసారి పంపిణీ ప్రక్రియ ప్రారంభమైతే... ఇంకా అర్హులు ఉంటే అప్లై చేసుకుంటారు. ఇంత రద్దీ ఉండబోదని ప్రభుత్వం భావిస్తోంది.

# తెరపైకి బుక్ ట్రెండ్స్...

హైదరాబాద్, ఫిబ్రవరి 20,ఏపీలో రెడ్ బుక్, తెలంగాణలో పింక్ బుక్, ఇప్పుడు కాషాయ బుక్.. తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా పొలిటికల్ బుక్స్ ట్రెండ్..ఉండేది ఐదేళ్లే అన్నారు ఈటల రాజేందర్. తాము కాషాయ బుక్ ను మెయింటేన్ చేస్తున్నామని, తమను ఇబ్బంది పెడుతున్న వారికి కచ్చితంగా తగిన పరిణామాలు ఉంటాయని ఈటల హెచ్చరించారు. టీడీపీ నేత నారా లోకేశ్ రెడ్ బుక్ తో ఏపీలో మొదలైన ఈ అపోజిషన్ బుక్ ట్రెండ్.. ఇప్పుడు తెలంగాణలో ఎంట్రీ ఇచ్చింది. పింక్ బుక్ రెడీ చేస్తామని ఇటీవలే కవిత ప్రకటన చేశారు. తాజాగా బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. కాషాయ బుక్ ను తెరపైకి తెచ్చారు. తాము కాషాయ బుక్ ను మెయింటేన్ చేస్తున్నామని, తమను ఇబ్బంది పెడుతున్న వారికి కచ్చితంగా తగిన పరిణామాలు ఉంటాయని ఈటల హెచ్చరించారు. ప్రభుత్వాలు ఉండేది ఐదేళ్లే అన్నారు ఈటల రాజేందర్. అయితే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉండేది 35 ఏళ్లు అని ఈటల చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల్లో ఎంతోమంది ఉద్దండులను తాము చూశామన్నారు. ఐఏఎస్ లు బానిసల్లా పని చేయొద్దని, గతంలో అలా పని చేసిన వారు జైలు పాలయ్యారని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని నడిపే నాయకుడికి అనుగుణంగా పనితీరు ఉంటుందని, సీఎంతో పాటు వారి బంధు మిత్రుల ఒత్తిడికి తలొగ్గదని ఆయన సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ జిల్లాలో ఈటల పర్యటించారు. మీడియాతో మాట్లాడిన ఈటల.. ఐఏఎస్, ఐపీఎస్ లను ఉద్దేశించి వార్నింగ్ ఇచ్చారు. అధికారులు చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించారు. బాసుల ఆదేశాలు పాటించడం కాకుండా నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. లేదంటే శ్రీలక్ష్మి సహా కొందరు అధికారులకు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. మేము కూడా ఆరెంజ్ బుక్ మెయింటేన్ చేస్తున్నామన్నారు. ఆ బుక్‌లో అందరి పేర్లు రాసుకుంటున్నామన్న ఈటల.. సమయం వచ్చినప్పుడు లెక్కలతో సహా బయటపెడతామని వార్నింగ్ ఇచ్చారు ఈటల. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని అన్నారు. అటు బీఆర్ఎస్ నేత కవిత సైతం పింక్ బుక్ అంటూ కలకలం రేపారు. తమ పార్టీ నేతలను, కార్యకర్తలను వేధిస్తున్నారని వదిలేది లేదన్నారు. తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తామని అధికారులకు వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులు, సీఎం రేవంత్ రెడ్డి అరాచకాలను పింక్ బుక్ లో నోటు చేస్తున్నామన్నారు కవిత. వచ్చేది తమ ప్రభుత్వమే అన్న కవిత.. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన నేతలు, అధికారులకు బుద్ధి చెబుతామని వార్నింగ్ ఇచ్చారు కవిత.

## రాజలింగమూర్తి హత్యను ఖండించిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర

జయశంకర్‌భూపాలపల్లి,భూపాలపల్లి పట్టణంలోని రెడ్డికాలనీలో 15వ వార్డు మాజీ కౌన్సిలర్ భర్త నాగవెల్లి రాజలింగమూర్తి ని కొంతమంది గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడి చేసి చంపడాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తీవ్రంగా ఖండించారు. దాడి జరిగి, చనిపోయిన విషయాన్ని



తెలుసుకున్న ఎమ్మెల్యే హుటాహుటిన అందుబాటులో ఉన్న కాంగ్రెస్ నేతలతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి చేరుకున్నారు. ఆసుపత్రిలో మృతిని బంధువులను ఎమ్మెల్యే ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. రాజలింగమూర్తి పై జరిగిన దాడిని అత్యంత తీవ్రంగా ఖండిస్తున్నానని, ఈ దాడి వెనుక ఎంతటివారున్నా శిక్షించాలని అన్నారు. ఈ దాడిపై పోలీసులు సమగ్ర విచారణ చేసి, త్వరగా దోషులను గుర్తించి శిక్షపడేలా చూడాలని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చట్టపరంగా పరిష్కరించుకోవడానికి అనేకమార్గాలు ఉన్నాయని, ఇలా హత్యలు చేయడం సమస్యకు పరిష్కారం కాదని ఎమ్మెల్యే అన్నారు.

# నేడు అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) మనిషి జీవితంలో మొదట నేర్చుకునే భాష మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఎలా పిలుస్తాడో.. మాతృభాష కూడా అంతే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నంగా వస్తుంది. అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21 న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించాలని 1999 నవంబరు 17న యునెస్కో ప్రకటించింది. 2000 సంవత్సరం నుంచి ప్రతి ఏటా మాతృభాషా పరిరక్షణ కార్యక్రమాన్ని యునెస్కో డైరెక్టర్ జనరల్ ప్రకటిస్తూ వస్తున్నారు. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతోంది. యునెస్కో 1999 ఫిబ్రవరి 21 న అంతర్జాతీయ మాతృభాష దినంగా ప్రకటించింది. 2000 ఫిబ్రవరి 21 నుండి ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. బంగ్లాదేశీయులు (అప్పటి తూర్పు పాకిస్తానీయులు ) చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ప్రతి ఏట ఈ అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. 1947 లో భారత దేశం, పాకిస్తాన్ విభజన జరిగినప్పుడు పాకిస్తాన్




రెండు భౌగోళికంగా వేర్వేరు భాగాలు ఏర్పడింది. ఒకటి తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుతం బంగ్లాదేశ్ అని పిలుస్తారు) రెండవది పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుతం పాకిస్తాన్ అని పిలుస్తారు). సంస్కృతి, భాష మొదలైన వాటిలో రెండు ఒకదానికొకటి చాలా భిన్నంగా ఉండేవి. ఈ రెండు భాగాలను భారతదేశం వేరు చేసింది. తూర్పు పాకిస్తాన్ (ఇప్పుడు బంగ్లాదేశ్), పశ్చిమ పాకిస్తాన్ (ఇప్పుడు పాకిస్తాన్ ) కలిపి మెజారిటీ ప్రజలు బెంగాలీ లేదా బంగ్లా భాష ఎక్కువగా మాట్లాడేవారు. 1948 లో అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం ఉర్దూను పాకిస్తాన్ జాతీయ భాషగా ప్రకటించింది. దీనికి తూర్పు పాకిస్తాన్ ప్రజలు అభ్యంతరం తెలిపారు. తూర్పు పాకిస్తాన్ జనాభాలో ఎక్కువ భాగం బెంగాలీ మాట్లాడతారు. ఉర్దూతో పాటు బెంగాలీ కూడా జాతీయ భాషలలో ఒకటిగా ఉండాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌ను తూర్పు పాకిస్థాన్‌కు చెందిన ధీరేంద్రనాథ్ దత్తా 1948 ఫిబ్రవరి 23 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో లేవనెత్తారు. తూర్పు పాకిస్తాన్ ప్రజలు (ప్రస్తుతం బంగ్లాదేశ్) నిరసనలు చేపట్టారు. భాష సమాన హోదా కోసం ఉద్యమం చేపట్టారు. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి పాకిస్థాన్ ప్రభుత్వం 144 సెక్షన్, ర్యాలీలు, మొదలైనవి ఢాకా నగరంలో నిషేధించింది. ఢాకా విశ్వవిద్యాలయం విద్యార్థులు, సాధారణ ప్రజల సహకారంతో భారీ ర్యాలీలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1952 ఫిబ్రవరి 21 న ర్యాలీలో పాల్గొన్న వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సలాం, బర్కాట్, రఫీక్, జబ్బర్, షఫియూర్ మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. చరిత్రలో ఇది చాలా అరుదైన సంఘటన, ప్రజలు తమ మాతృభాష కోసం ప్రాణాలను అర్పించారు. పోలీసుల దాడికి నిరసనగా ముస్లిం లీగ్ అదే రోజు పార్లమెంటరీ పార్టీకి రాజీనామా చేశారు. ఉద్యమం పెరుగుతున్న నేపథ్యంలో, పాకిస్తాన్ కేంద్ర ప్రభుత్వం చివరకు దిగి వచ్చింది. 1954 మే 8 న పాకిస్తాన్ రాజ్యాంగ సభలో బెంగాలీని రాష్ట్ర భాషలలో ఒకటిగా స్వీకరించారు. 1956 లో పాకిస్తాన్ మొదటి రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు, ఆర్టికల్ 214 లో బెంగాలీ ఉర్దూలను పాకిస్తాన్ రాష్ట్ర భాషలుగా పేర్కొంది. 1971 లో బంగ్లాదేశ్ స్వతంత్రమైనప్పుడు, బెంగాలీ ఏకైక రాష్ట్ర భాషగా ప్రవేశపెట్టబడింది. యునెస్కో బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకుని 1999 ఫిబ్రవరి 21, న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ప్రకటించింది.

# తెలంగాణలో రంజాన్ రచ్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 20, తెలంగాణ రాజకీయాల్లో పూర్తిస్థాయిలో మార్పులు కనిపిస్తున్నాయి. మతం హైలెట్ అవుతోంది. అదే పనిగా కుల, మతాలను వాడేసుకుంటున్నారు మూడు పార్టీల నేతలు. తాజాగా రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు గంటపాటు వెసులుబాటు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై బీజేపీ రచ్చ ప్రారంభించింది. నిన్నటి వరకు బీసీ కుల గణనలో ముస్లిం బీసీలు అని పేర్కొడంపై బీజేపీ నేతలు మండిపడ్డారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అయితే బీసీ ముస్లింలు ఏంటి అని, తొలగించాలని డిమాండ్ చేశారు. దానిని తొలగిస్తే బీసీ రిజర్వేషన్ల పెంపు విషయం ఆలోచిస్తామని తెలిపారు. ఇక తాజాగా రంజాన్ సందర్భంగా ముస్లిం ఉద్యోగులకు వెసులుబాటుపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి అవకాశం హిందువులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సడలింపు విధానం మొదలు పెట్టింది. పదేళ్లు కొనసాగించింది. ఇప్పుడు కాంగ్రెస్ కూడా పాత ఉత్తర్వులనే ఇచ్చింది. వారు స్పెసిఫిక్‌గా ఆ సమయంలో ప్రార్థనలకు వెళ్లాలి కాబట్టి అవకాశం కల్పిస్తున్నారు. గతంలో ఎవరూ అభ్యంతరం తెలుపలేదు. కానీ ఈసారి బీజేపీ దీనిని తప్పుపడుతోంది. ప్రభుత్వం తీరుపై విమర్శలు చేస్తోంది. అలాంటి ఛాన్స్ ఇవ్వడం కరెక్ట్ కాందటున్నారు ఆ పార్టీ నేతలు. ముస్లింలకు అవకాశం ఇస్తే మీకేం ఇబ్బంది అంటున్నారని, హిందువులకు ఇవ్వలేదు కదా అంటున్నారు. ఇక్కడే అసలు రాజకీయం మొదలైంది. బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలకు అధికార కాంగ్రెస్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేస్తోంది. హిందువుల పండుగలకు కూడా అవసరమైనప్పుడు వెసులుబాటు ఇస్తున్నామని చెబుతోంది. అయినా బీజేపీ హిందువులకు ఇవ్వడం లేదని గట్టిగా వాయిస్ వినిపిస్తోంది. కాంగ్రెస్ ఎంపీ ఛామల కిరణ్‌కుమార్‌రెడ్డి వివరణ ఇవ్వడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. దీంతో చర్చను మరింత పెంచింది. అయితే కాంగ్రెస్ వివరణ ఇచ్చుకునే తీరు ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ముస్లింలకు వెసులుబాటు కల్పించడం కొత్తేమీ కాదు. కానీ బీజేపీ నేతలు కలిసివచ్చే అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. వచ్చే ఎన్నికలనాటికి బీజేపీ కాంగ్రెస్ మధ్యే పోటీ ఉండాలని బీజేపీ భావిస్తోంది. అప్పటి వరకు బీఆర్ఎస్‌ను బలహీనపర్చాలని రెండు జాతీయ పార్టీలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే రెండు పార్టీలు వీలు దొరికినప్పుడల్లా.. బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తున్నాయి.

# కేశవ్ కుంజ్ ప్రారంభించిన మోహన్ భగవత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కొత్త కార్యాలయం 'కేశవ్ కుంజ్'ను చీఫ్ మోహన్ భగవత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు. ఝండేవాలన్‌లోని కార్యాలయంలో నిర్వహించిన 'కార్మికుల సమావేశం'లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే కూడా పాల్గొన్నారు. ఆయనతో పాటు సంస్థలోని ఇతర సీనియర్ అధికారులు, ఆర్ఎస్ఎస్‌తో అనుబంధ సంస్థల అధికారులు, స్వచ్ఛంద సేవకులు కూడా హాజరయ్యారు. కొత్త ఆర్ఎస్ఎస్ కార్యాలయం సాంప్రదాయ భారతీయ నిర్మాణ శైలిని ఆధునిక సౌకర్యాలతో మిళితం చేస్తుంది. ఇందుకు తగ్గట్టుగా వైభవం చాటి చెప్పాలే ప్రతి ఒక్క ఆర్ఎస్ఎస్ సేవకులు నడుచుకోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. హిందూ సమాజం ఐక్యంగా ఉండి, కులం, ప్రాంత, భాష బేధం లేకుండా హిందువులందరినీ ఒకటిగా చూడాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. హిందూ ధర్మంలో ఎవరూ గొప్పవారు, ఎవరు తక్కువవారు కాదన్నారు. ప్రస్తుతం వివిధ కోణాల ద్వారా సంఘ్ విస్తరిస్తోందని ఆయన అన్నారు. సంఘ వాలంటీర్ ప్రవర్తన సమర్థవంతంగా, స్వచ్ఛంగా ఉండాలని పిలుపునిచ్చారు. నేడు సంఘ్ పరిస్థితి మారిపోయిందని, దిశను మార్చకూడదని భగవత్ అన్నారు. శ్రేయస్సు అవసరం, అవసరమైనంత సంపద ఉండాలి. కానీ అది పరిమితుల్లోనే చేయాలి. శ్రీ కేశవ్ స్మారక కమిటీ పునరుద్ధరించిన ఈ భవనం చాలా గొప్పది, దాని గొప్పతనానికి అనుగుణంగా పని జరగాలని మోహన్ భగవత్ ఆకాంక్షించారు. సర్ సంఘ్‌చాలక్ జీ సంఘ్ ప్రారంభం నుండి మొదటి సర్ సంఘ్‌చాలక్ ఎదుర్కొన్న వివిధ ఇబ్బందులను ప్రస్తావించారు. నాగ్‌పూర్‌లో మొదటి కార్యాలయం 'మహల్' ప్రారంభం గురించి మాట్లాడారు. ఢిల్లీ దేశ రాజధాని కాబట్టి, ఇక్కడి నుంచే సమాచార వనరులు పనిచేస్తున్నందున, ఇక్కడ ఒక కార్యాలయం అవసరం ఉందని, ఆ అవసరం మేరకు ఇక్కడ ఒక కార్యాలయం నిర్మించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ గొప్ప భవనం నిర్మాణంతో సంఘ వాలంటీర్ పని పూర్తి కాదని ఆయన అన్నారు. నిర్లక్ష్యం, వ్యతిరేకత మనల్ని జాగ్రత్తగా ఉంచుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుతం అందుకు అనుకూలమైన వాతావరణం ఉంది. మనం మరింత అప్రమత్తంగా ఉండాలని మోహన్ భగవత్ సూచించారు. ఈ సందర్భంగా హాజరైన స్వచ్ఛంద సేవకులను ఉద్దేశించి సర్ సంఘ్‌చాలక్ జీ, కార్యాలయం మనకు పని చేయడానికి స్ఫూర్తినిస్తుందని, కానీ దాని పర్యావరణాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ప్రతి స్వచ్ఛంద సేవకుడి విధి అని అన్నారు. కొత్త ఆర్ఎస్ఎస్ కార్యాలయం సాంప్రదాయ భారతీయ నిర్మాణ శైలితోపాటు ఆధునిక సౌకర్యాల కలయికను నిర్మించారు. ఈ భవనం దాదాపు 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో ఒక టవర్, ఆడిటోరియం, లైబ్రరీ, ఆసుపత్రి, హనుమాన్ ఆలయం కూడా ఉన్నాయి. ఈ అద్భుతమైన భవనం ప్రజా విరాళాల ద్వారా నిర్మిం చారు. దీనికి 75,000 మందికి పైగా ప్రజలు విరాళాలు ఇచ్చారు. నిర్మాణ పనులు దాదాపు ఎనిమిది సంవత్సరాలు పట్టాయి. దాని మొత్తం ఖర్చు దాదాపు రూ. 150 కోట్లు. ఈ కొత్త భీూా కార్యాలయాన్ని గుజరాత్‌కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్ అనుప్ దేవ్ రూపొందించారు. ఇందులో, గాలితో కూడిన నిర్మాణం, సహజ కాంతి కోసం పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ మూడు స్తంభాలకు 'సాధన', 'ప్రేరణ', 'అర్చన' అని పేర్లు పెట్టారు. సంఘ్ కార్యాలయంలోకి అడుగుపెట్టగానే, ముందుగా గుర్తుకు వచ్చేది 'సాధన' టవర్, తరువాత 'ప్రేరణ', చివరకు 'అర్చన' టవర్.

# చిక్కుల్లో మోనాలిసా



ముంబై, ఫిబ్రవరి 20, యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా జరుగుతోంది. ఈ కుంభమేళాకు వచ్చిన చాలామంది సామాన్యులు ఓవర్‌నైట్‌లోనే వైరల్‌గా మారారు. అలా వచ్చి సెలబ్రిటీగా మారిపోయింది మోనాలిసా. కుంభమేళాలో పూసల దండలు అమ్ముకునేందుకు వచ్చిన మోనాలిసా ఒక్కసారిగా నెట్టింట వైరల్ అయిపోయింది. ఈ నీలికళ్ల సుందరి ఓవర్ నైట్‌లోని సోషల్ మీడియా క్వీన్‌గా మారింది. ఆమె ఫోటోలు, వీడియోలు నెట్టింట తెగ చక్కర్లు కొట్టాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఈమె రిస్క్‌లో పడ్డట్టు వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై ఇటీవల మోనాలిసా క్లారిటీ ఇచ్చింది. కుంభమేళా మోనాలిసాను చూసిన డైరెక్టర్ సనోజ్ మిశ్రా ఆమె ఇంటికి వచ్చి సినిమా ఆఫర్ ఇచ్చారు. 'ది డైరీ ఆఫ్ మణిపూర్' పేరుతో ఓ సినిమా చేస్తున్నానని.. అందులో కుంభమేళా మోనాలిసా హీరోయిన్‌గా నటిస్తోందని తెలిపాడు. ఇది విన్న వారంతా ఓవర్‌నైట్‌లోనే మోనాలిసా దశ తిరిగిపోయిందని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో ఆమె న్యూ లుక్‌లో దిగిన ఫోటోలు బయటకు వచ్చాయి. అలాగే తాజాగా మోనాలిసా ఓ బ్రాండ్ ప్రమోషనల్ ఈవెంట్‌కు హాజరయ్యింది. ఇదిలా ఉంటే.. తాజాగా నిర్మాత జితేంద్ర నారాయణ్ మోనాలిసా రిస్క్‌లో ఉన్నట్టు చెప్పాడు. మోనాలిసా దర్శకుడు సనోజ్ మిశ్రా ట్రాప్‌లో పడిందని ఆరోపించాడు. అతడి దగ్గర సినిమాను నిర్మించేందుకు సరిపడా డబ్బులు లేవని, ఫేమ్ కోసమే అతడు మోనాలిసాను తిప్పుకుంటున్నాడని ఘాటైన వ్యాఖ్యలు చేశాడు. ఇక తాజాగా వీటిపై మోనాలిసా క్లారిటీ ఇచ్చింది. సనోజ్ మిశ్రాపై వస్తున్నా వార్తల్లో నిజం లేదని.. అవన్నీ వట్టి పుకార్లేనని కొట్టిపారేసింది. తానెవ్వరి ట్రాప్‌లో పడలేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం తను మధ్యప్రదేశ్‌లోని యాక్టింగ్ స్కూల్‌లో నటన నేర్చుకుంటున్నానని.. తనతో తన కుటుంబం కూడా ఉందని స్పష్టం చేసింది. సనోజ్ ఎప్పుడూ తనను కూతురులా చూసుకుంటారని.. ఆయన చాలా మంచి మనిషి అని చెప్పుకొచ్చింది కుంభమేళా మోనాలిసా.

# 22 లక్షలకే టెస్లా కార్...

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20, దేశంలోని రెండు ప్రధాన నగరాల్లో ఇప్పటికే రిటైల్ అవుట్ లెట్ల కోసం స్థలాన్ని లీజుకు తీసుకున్న టెస్లా.. అక్కడి నుంచి అమ్మకాలను జరుపనుంది. ఏప్రిల్ నెలలో టెస్లా కంపెనీ భారత్ లో తన మె?దటి షోరూమ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. అప్పుడే దాని తొలి ఎలక్ట్రిక్ కారు భారత్ లోకి రానున్నట్లు సమాచారం. అసలు టెస్లా కారు అమెరికాలో ఎందుకు ఇంత ఫేమస్ అయిందో చూద్దాం. భారత ప్రధాని మోడీ అమెరికా పర్యటనకు వెళ్లి వచ్చారు. ఆ సమయంలో ఆయన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ లతో భేటీ అయ్యారు. దీంతో భారత్ లోకి టెస్లా ఎంట్రీ ఖాయం అయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దేశంలోని వివిధ విభాగాల్లో ఆ కంపెనీలో పని చేసేందుకు ఉద్యోగుల కోసం టెస్లా అన్వేషణ మొదలు పెట్టింది. అందుకు ఉద్యోగ ప్రకటనలను కూడా చేసింది. ప్రస్తుతం టెస్లా ఎప్పుడెప్పుడు భారత్ లోకి అడుగు పెడుతుందా అని చాలా మంది ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ నెల నుంచి కార్ల ప్రియులకు టెస్లా కార్లు అందుబాటులో ఉంటాయని కంపెనీ ప్రకటించింది. దేశంలోని రెండు ప్రధాన నగరాల్లో ఇప్పటికే రిటైల్ అవుట్ లెట్ల కోసం స్థలాన్ని లీజుకు తీసుకున్న టెస్లా.. అక్కడి నుంచి అమ్మకాలను జరుపనుంది. ఏప్రిల్ నెలలో టెస్లా కంపెనీ భారత్ లో తన మె?దటి షోరూమ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. అప్పుడే దాని తొలి ఎలక్ట్రిక్ కారు భారత్ లోకి రానున్నట్లు సమాచారం. అసలు టెస్లా కారు అమెరికాలో ఎందుకు ఇంత ఫేమస్ అయిందో చూద్దాం. టెస్లా కంపెనీ తన కార్ల ఆవిష్కరణ, అద్భుతమైన పనితీరు, పర్యావరణానికి హాని తలపెట్టకుండా ఉండడం, అత్యాధునిక డిజైన్, ఫీచర్ల కారణంగా అమెరికాలో ప్రజాదరణ పొందింది. దాంతో పాటు అక్కడి ప్రభుత్వం అందజేస్తున్నప్రోత్సాహకాలు, విస్తృతమైన సూపర్ చార్జర్ నెట్‌వర్క్‌ల కారణంగా టెస్లా కార్లు కొనుగోలుదారులను ఆకర్షించాయి. కంపెనీ యజమాని అయిన ఎలోన్ మస్క్ తరచూ సోషల్ మీడియా ద్వారా టెస్లా కంపెనీ కార్ల గురించి ఇన్ఫర్మేషన్ ఇస్తూనే ఉంటాడు. దీంతో జనాల్లో ఎప్పుడూ ఈ కారు గురించిన చర్చలు నడుస్తూనే ఉంటాయి. వాస్తానికి కొన్నేళ్లుగా భారత్ మార్కెట్లో తమ వాహనాలను అమ్మాలని టెస్లా చూస్తుంది. ఎట్టకేలను కంపెనీ నిరీక్షణకు తెరపడింది. ఈ నేపథ్యంలోనే ఏప్రిల్ నుంచి దేశంలో టెస్లా కార్లు అందుబాటులోకి రాబోతున్నాయి. అయితే.. ప్రస్తుతానికి దేశీయంగా ఉత్పత్తి ప్లాంట్లను నిర్మించడం, ఇక్కడే ఉపాధి అవకాశాలను పెంచడం వంటి కండీషన్లను పక్కనపెట్టి.. బెర్లిన్ ప్లాంట్ నుంచి ఉత్పత్తి అయిన వాహనాలను దేశంలో కంపెనీ విక్రయించనుంది. ఇందుకోసం ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబైలలో షోరూంలను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ముంబైలోని బీకేసీ బిజినెస్ డిస్ట్రిక్ట్, ఢిల్లీలోని ఏరోసిటీలో షోరూమ్ లను ఏర్పాటు చేయనుంది టెస్లాటెస్లా తన కార్ల కోసంచాలా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ వాడుతుంది. ఈ కార్లు ఒక్క సారి ఫుల్ చార్జీ చేస్తే ఎక్కువ దూరం ప్రయాణించగలవు. ఎలక్ట్రిక్ కార్లు కావడంతో పర్యావరణానికి కూడా హాని కలిగించవు. దీంతో పాటు కంపెనీ లాంగ్-రేంజ్ బ్యాటరీలు, సూపర్ చార్జర్ నెట్‌వర్క్‌లు, డ్రైవర్-ఫ్రెండ్లీ సిస్టమ్ ఏర్పాటు చేసింది. ఇవన్నీ ఉండడం వల్లే టెస్లా కార్లకు అంత క్రేజ్ ఏర్పడింది. సాధారణంగా భారత్ లో జనాభా ఎక్కువ అన్న సంగతి తెలిసిందే. అందుకే ఇతర దేశాలతో పోలిస్తే ఇక్కడ మార్కెట్ విస్తృతంగా ఉంటుంది. పైగా ఇక్కడ మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉంటారు. అలాంటి వారిని టార్గెట్ గా తీసుకుని టెస్లా తన కార్లను ఇక్కడ ప్రవేశ పెట్టాలని భావిస్తోంది. అందుకే వారందరికీ అందుబాటు ధరల్లో ఉండే విధంగా కేవలం రూ. 22లక్షలకే టెస్లా కార్లను అందించాలని కంపెనీ ప్రణాళికలను రచిస్తుంది. ఇంకా అంత కంటే తక్కువ ధరకైనా ఇచ్చి మార్కెట్లో తన సత్తా చాటాలని భావిస్తుంది. అదే నిజం అయితే ప్రస్తుతం మార్కెట్ ను ఏలుతున్న కంపెనీలు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సిందే.

# స్వర్ణగిరి బ్రహ్మోత్సవాలు రెండవ రోజు

భువనగిరి, స్వర్ణగిరిలో బ్రహ్మోత్సవాలు గురువారం కొనసాగాయి. ఉదయం యాగశాల ప్రవేశం జరిగింది. తదుపరి అగ్ని మథనం, అగ్ని ప్రజ్వలన కార్యక్రమాలు జరిగాయి. యాగశాలలో మూర్తి కుంభ మండల అగ్ని స్థాపనాది పాంచరాత్ర ఆగమోక్త పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. దివ్యదేశ బహుమానం సమర్పణలో భాగంగా మొట్టమొదటి దివ్యదేశం తమిళనాడు లోని శ్రీ రంగం దివ్య దేశం నుండి ఆలయ ప్రథమ ఆచార్య పురుషులు పరశర లక్ష్మి నృసింహ భట్టర్ స్వామి, శ్రీ రంగనాథ స్వామి వారి శేష వస్త్రం, మాల,

అభయహస్తం తీసుకొని వచ్చి స్వర్ణగిరి దేవస్థానమ్ వ్యవస్థపాక ధర్మకర్త మానేపల్లి రామారావు దంపతులకు మానేపల్లి మురళీకృష్ణ దంపతులకు అందచేశారు. పై కార్యక్రమం లో శ్రీ శ్రీశ్రీ త్రిదండి అహోబిల రామానూజ జీయర్ స్వామి వేంచేసి తమ మంగళశాసనములు అందించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించుటకు ఆలయ ధర్మకర్తలు గరుడ పటమును శాస్త్రోక్తంగా ధ్వజ స్థంభం వద్ద ఎగురవేశారు. అనంతరం సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదాన్ని అందించారు. తరువాత శ్రీ స్వామి వారిని సూర్యప్రభ వాహనంలో కొలువుదీర్చి మేళ తాళాలు మంగళ వాద్యాల నడుమ ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగించారు..

# అగ్రరాజ్యానికి కేసీఆర్




హైదరాబాద్, ఫిబ్రవరి 29, బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా అడుగులు వేయకుంటే పార్టీ మటాష్ అవుతుందని భావించారట పెద్దాయన. ఆ విధంగా అడుగులు వేసినట్టు కనిపిస్తోంది. బీసీల అంశం పార్టీలో ఏ మాత్రం ప్రస్తావనకు రాకుండా జాగ్రత్త పడ్డారు. ఈ క్రమంలో పాత అంశాలను ప్రస్తావించినట్టు కొందరు నేతలు చెబుతున్నారు. పార్టీలో ఇప్పటివరకు వర్కింగ్ ప్రెసిడెంట్ ఒక్కరే ఉన్నారు. ఆ సంఖ్యను నాలుగుకు చేర్చాలని నిర్ణయం తీసుకున్నారట పార్టీ అధినేత. ఇప్పటివరకు కేటీఆర్ ఒక్కటే వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉండేవారు. కేటీఆర్‌తోపాటు మరో ముగ్గరికి అవకాశం కల్పించనున్నా రట. వారిలో మహిళలకు ఎక్కువగా ఛాన్స్ ఉందని పార్టీ వర్గాల మాట. ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ, ఇంకొకరు టాప్ కమ్యూనిటీకి చెందిన మహిళ ఉండనున్నట్లు తెలుస్తోంది. పార్టీ ఇంతలా దిగజారి పోవటానికి మీరే కారణమని కొందరు సీనియర్లు తప్పుబట్టారని తెలుస్తోంది. తొలుత ఇంటి సమస్యలు సరిదిద్దుకుంటే, ప్రత్యర్థులకు ధీటుగా బదులు ఇవ్వవచ్చని చెప్పినట్టు సమాచారం. ఒకానొక దశలో యువనేతపై కేసీఆర్ కాసింత ఆగ్రహం వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల మాట. ఇంటిని చక్కదిద్దుకునే పనిలో భాగంగా హాజరైన నేతల నుంచి అభిప్రాయసేకరణ చేశారు. పార్టీలకు అనుగుణంగా బహిరంగ సభ నిర్వహణ, కొన్ని కమిటీలకు ఇన్‌ఛార్జ్‌గా హరీష్‌రావుకు బాధ్యతలు అప్పగించారు కేసీఆర్. ఆ విషయాన్ని మీడియా సమావేశంలో కేటీఆర్ వెల్లడించారు. గత ఎన్నికల్లో మహిళలు బీఆర్ఎస్‌ను చావదెబ్బ కొట్టారని కేసీఆర్‌కు పలు నివేదికలు అందాయి. ఈ నేపథ్యంలో పార్టీలో మహిళలకు పెద్ద పీఠ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో ప్రత్యేకంగా మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దానికి అధ్యక్షురాలిగా కవితను నియమించే ఛాన్స్ ఉన్నట్లు సమాచారం. మరోవైపు కేసీఆర్ అమెరికా టూర్ వెళ్లాలని నిర్ణయించినట్టు పార్టీ వర్గాల మాట. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ నివేదిక తుది దశకు చేరింది. రేపో మాపో రేవంత్ ప్రభుత్వానికి అందజేయనుంది. ఈ నేపథ్యంలో ఆయన అమెరికా టూర్‌కి శ్రీకారం చుట్టడంపై పలు అనుమానాలు మొదలయ్యాయి. ఇందులోభాగంగా ఫామ్ హౌస్ నుంచి పార్టీ ఆఫీసుకు వెళ్లకుండా కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసుకు వెళ్లారని అంటున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే డిప్లమాటిక్ పాస్‌పోర్టును అప్పగిస్తారు మాజీ ముఖ్యమంత్రులు. ఏడాది తర్వాత డిప్లమాటిక్ పాస్‌పోర్టు ఇవ్వరని అంటున్నారు. ఈ క్రమంలో ఏపీ జగన్ విషయాన్ని గుర్తు చేశారు. ఇక కేసీఆర్ అమెరికాలో ఉండేందుకు రెండునెలలుగా తెర వెనుక ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా కేసీఆర్ ఫారెన్ టూర్ వెళ్లడం పక్కాగా ఖాయమన్నమాట.

# వందల సంఖ్యలో కోళ్లు మృతి

## ఆదుకోవాలని రైతు వేడుకోలు

రాజన్న సిరిసిల్ల, చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో రమేష్ రావు అనే వ్యక్తి 14 ఏళ్లుగా కోళ్ల ఫారం తో జీవనోపాధి పొందుతున్నాడు. రైతుకు చెందిన కోళ్లు వారం క్రితం ఫామ్లో మూడు రోజుల వ్యవధిలో 2500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. వారం రోజుల క్రితం రైతు రమేష్ రావు రోజు మాదిరిగానే కోళ్ల ఫారం కు వెళ్లి చూడగా వందల సంఖ్యలో కోళ్లు మృతి చెంది కనిపించాయి. దీంతో వాటిని ట్రాక్టర్ లో తీసుకెళ్లి గ్రామానికి దూరంగా పడేసినట్లు పేర్కొన్నారు. 35 రోజుల వ్యవధిలో కోళ్లు మొత్తం మృతి చెందడంతో నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. మండలంలోని ఇతర గ్రామంలో కూడా కొన్ని కోళ్ల ఫామ్ లో కూడా కోళ్లు మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

# ఏపీలో హాట్ పాలిటిక్స్...

విజయవాడ, ఫిబ్రవరి 20,ఆంధ్రప్రదేశ్‌లో ఎండలతోపాటు రాజకీయం కూడా వేడెక్కింది. అసెంబ్లీకి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నిస్తున్న ప్రభుత్వానికి జనంలో ఉంటూనే జగన్ మోహన్ రెడ్డి బదులిస్తున్నారు. ప్రశ్నలు సంధిస్తున్నారు. అటు నుంచి అధికార పార్టీ నేతలు కూడా ఘాటుగానే బదులిస్తున్నారు. మరోవైపు షర్మిల ఇద్దరిపై విరుచుకుపడుతున్నారు. మొత్తానికి ఆంధ్రప్రదేశ్ రాజకీయం మిర్చి మసాలగా మారింది. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి స్పీడ్ పెంచినట్టు కనిపిస్తున్నారు. మంగళవారం జైల్లో వంశీని పరామర్శించారు. బుధవారం గుంటూరు మిర్చియార్డ్‌కు వెళ్లారు. అక్కడ రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన... ఆంధ్రప్రదేశ్‌లో రైతులు సంతోషంగా లేరని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి న్యాయం జరగడం లేదని విమర్శించారు. ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని ధ్వజమెత్తారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో రైతులకోసం ప్రవేశపెట్టిన సంస్కరణలన్నీ కనపడకుండా పోయాయి. గ్రామాల్లో ఆర్బీకే వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. మా ప్రభుత్వ హయాంలో ఇతర పంట కొనుగోళ్లకు రూ.7,000 కోట్లు ఖర్చు చేసి ప్రతి రైతునూ ఆదుకున్నాం. నేడు కల్తీ విత్తనాలు, ఎరువులు బ్లాక్‌లో కొనాల్సిన పరిస్థితి.? ఈకొత్తప్రభుత్వం వచ్చన తర్వాత పెట్టుబడి సాయం రావడం లేదని, సున్నా వడ్డీకి రుణాలు ఇవ్వలేకపోయారని జగన్ మండిపడ్డారు. కల్తీ విత్తనాలు సరఫరా ప్రభుత్వమే చేస్తోందని ఆరోపించారు. మిర్చి రైతుల కష్టాలు చంద్రబాబుకు కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే రైతులకు అండగా వైసీపీ పోరుబాట పడుతుందన్నారు జగన్. టూర్ తర్వాత సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన జగన్ కూటమి ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. రాష్ట్రంలో మొన్నటి వరకు ధాన్యం రైతులు ఇబ్బంది పడ్డారని ఇప్పుడు మిర్చి రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. చంద్రబాబు వచ్చినప్పటి నుంచి రైతులను పట్టి పీడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో క్వింటా ధర రూ.21-27 వేలు పలికిందని ఇప్పుడు రూ.8-11వేలకు పడిపోయిందన్నారు. ఈ ఏడాది తెగుళ్ల కారణంగా మిర్చి పంట దిగుబడి పడిపోయిందని ఎకరాకు పది క్వింటాళ్లకు మించి రాలేదన్నారు. కౌలు రైతు పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. ముఖ్యంగా కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లా రైతులు మరిన్ని ఇబ్బందు పడతున్నారని ఆరోపించారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. దీనిపై రివ్యూ కూడా చేయలేదన్నారు. రైతులకు సాయం చేయకపోగా తాము తీసుకొచ్చిన విప్లవాత్మక పథకాలు కూడా మూల పడేశారని ధ్వజమెత్తారు. జగన్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం ఘాటుగా రియాక్ట్ అయ్యింది. అధికారంలో ఉన్నప్పుడు కనీసం అడుగు బయట పెట్టని వ్యక్తి ఇప్పుడు ఏదో రాజకీయం చేయడానికి బయటకు వస్తున్నారని అన్నారు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు. జగన్ చేసిన కామెంట్స్ చూస్తుంటే మానసికస్థితి సరిగా లేదని అర్థమవుతుందని ధ్వజమెత్తారు. జగన్ చెప్పే అబద్దాలు విన్న ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. జగన్‌కు పని లేకపోవడంతోనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని అన్నారు. వ్యవసాయం కోసం జగన్ చేసిందేంటని ప్రశ్నించారు. దీనికి తోడు భారీగా బకాయిలు పెట్టి వెళ్లిపోయారని మండిపడ్డారు. ఇద్దరీ ప్రజల పట్ల చిత్త శుద్ధి లేదని ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఎన్నికల హామీలు అమలు చేసి ప్రజలను ఆదుకోవడం తెలియడం లేదని ఆక్షేపించారు. అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీసే సత్తా జగన్‌కు లేదని మండిపడ్డారు.

# మిర్చి ధర ఎందుకు పడిపోయింది

గుంటూరు, ఫిబ్రవరి 20, ధరల చదరంగంలో మిర్చి రైతులు నిలువునా దగా పడ్డారు. కాచుకొని కూర్చున్న వ్యాపారులు.. అదును చూసి దెబ్బకొట్టారు. నిరుడు ఇదే సీజన్‌లో క్వింటాకు రూ.22 వేల చొప్పున వెచ్చించిన ఖరీదుదారులు.. ఈ ఏడాది సీజన్ నాటికి ధరలను అమాంతం తగ్గించారు. ఖరీదుదారుల వ్యూహానికి ధరలు నేలచూపులు చూస్తుండడంతో ఎర్ర బంగారం రైతులు బోరుమంటున్నారు. నిరుడు క్వింటా మిర్చిని రూ.22 వేల నుంచి రూ.23 వేల మధ్య కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఈ పంట సాగుకు ఆశలు పెంచుకున్నారు. ఈ ధర మరికొంత పెరుగుతుందేమోనని కొందరు రైతులు కోల్డ్ స్టోరేజీల్లో భద్రపర్చుకున్నారు. ఇప్పుడు ధరలు దారుణంగా తగ్గడంతో నెత్తీనోరూ బాదుకుంటున్నారుగత సీజన్ వరకు మిర్చి ధర 21వేలకు పైగా పలికింది. అయితే.. సడెన్‌గా 13 వేలకు పడిపోవడం రైతులకు షాకిచ్చింది. అంతేకాదు క్వాలిటీ లేదంటూ కొన్ని చోట్ల తొలి కోత కాయ కూడా 10 వేలు నుంచి 12 వేలకే అడుగుతున్నారు. దాంతో మహమ్మారి తెగుళ్ల నుంచి పంటను కాపాడుకున్న మిర్చి రైతులు లబోదిబోమంటన్నారు. ధర పతనంతో ఆందోళనలకు దిగారు. ఈ క్రమంలోనే.. వైసీపీ అధినేత జగన్.. గుంటూరు మిర్చి యార్డ్‌ను సందర్శించడం కాకరేపింది. మిర్చి రైతులను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కరాకు సుమారుగా రూ.లక్ష పైగా పెట్టుబడి పెట్టారు. స్థానికంగా కూలీల కొరత ఏర్పడటంతో ఇతర రాష్ట్రాల నుంచి వాహనాల్లో కూలీలను తెప్పించుకొని మరీ మిర్చి పంటలు కోశారు. మిర్చి తోటల వద్ద కూలీలకు అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఇలా మిర్చి కోతలకే ఎకరానికి సుమారు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. కానీ.. ఇంతలా శ్రమించి మిర్చిని కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే ధరలు మాత్రం దారుణంగా పతనమై కన్పిస్తున్నాయి. నాణ్యతను బట్టి బహిరంగ మార్కెట్లో క్వింటా మిర్చి ధర రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు మాత్రమే పలుకుతోంది. దీంతో మిర్చి రైతుకు కంటతడి తప్ప మరేమీ లేకుండా పోతోంది. మరుసటి ఏడాది వరకూ కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుదామంటే ఇప్పుడు పెట్టుబడులు పూడే



మార్గం కన్పించడం లేదు. పైగా నిరుటి అనుభవం దృష్ట్యా అప్పటి ధర ఎలా ఉంటుందోనన్న అనుమానాలు వెంటాడుతున్నాయి. దీంతో కొందరు రైతులు ఇదే ధరలకు తెగనమ్ముకుంటుండగా.. మరికొందరు రైతులు మాత్రం తమ పంటను కల్లాల్లోనే నిల్వ ఉంచుకొని ధరల పెరుగుదల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా.. మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు జగన్. 13వేల ధరతో మిరప రైతులకు పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే పంటలకు మద్దతు ధరలు కల్పించాలని.. లేనిపక్షంలో రైతుల తరపున పోరాటాలకు దిగుతామని జగన్ హెచ్చరించారుఇక.. రైతుల ఆందోళనలతో మిర్చి ధరలపై సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. మిర్చి రైతులను ఆదుకోవాలంటూ కేంద్రానికి లేఖ రాశారు. ధరల స్థిరీకరణ నిధి కింద రేటు పెంచాలని విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా ఏపీలో మిర్చి పంటలు దెబ్బతిన్నాయని.. మిర్చి రైతుల సమస్యను ప్రత్యేక కేసుగా గుర్తించాలని కేంద్రాన్ని కోరారు. అలాగే..

ఢిల్లీ పర్యటనలో మిర్చి రైతుల ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. మరోవైపు.. మిర్చి రైతుల విషయంలో జగన్ కామెంట్స్‌పై ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు రియాక్ట్ అయ్యారు. జగన్ తీరు కరెక్ట్ కాదని.. మిర్చికి మద్దతు ధర పెడితే అంతకుమించి రేటు పలకదని గుర్తుంచుకోవాలన్నారు. మిర్చి రైతుకు ఎక్కువ మేలు చేయాలనేదే తమ ప్రయత్నమని.. కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు చేస్తున్నామని అచ్చెన్నాయుడు తెలిపారు.

# అప్ డేట్ కానీ సర్వర్లు..

## అవస్థల్లో జనాలు

విజయవాడ, ఫిబ్రవరి 20,వాట్సాప్‌లో ప్రభుత్వ సేవలన్నీ అందిస్తున్నామని చెప్పుకునే ఏపీలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ సర్వర్లు మొరాయిస్తుండటంతో జనానికి చుక్కలు కనిపిస్తున్నాయి. బుధవారం గంటల పాటు సర్వర్లు నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. దీంతో క్రయ, విక్రయాల కోసం వచ్చిన వారికి చుక్కలు కనిపించాయి. ఆంధ్రప్రదేశ్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సేవలు జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. ఎప్పుడు అందుబాటులో ఉంటాయో, ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితిలో ఆ శాఖ నడుస్తోంది. బుధవారం ఉదయం సరిగ్గా రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యే సమయానికి సర్వర్లు ఆగిపోయాయి. దీంతో క్రయ, విక్రయాలు, ఇతర రిజిస్ట్రేషన్ సేవల కోసం వచ్చిన వారికి ఇబ్బందులు తప్పలేదు. ఐదు పది నిమిషాల్లో సర్వర్లు అందుబాటులోకి వస్తాయని చెప్పినా అవి గంటల తరబడి పనిచేయలేదు. దీంతో లావాదేవీల కోసం వచ్చిన వారు ఎదురు చూడక తప్పలేదు. ఆర్థిక సంవత్సరం చివరి నెల కావడంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం కోసం కసరత్తు జరుగుతున్న సమయంలో సర్వర్లు మొరాయించాయి. జిల్లాల వారీగా రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పెంచడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయార్జనపై సమీక్ష జరిగింది. అదే సమయంలో ఆ శాఖ సర్వర్లు నిలిచిపోవడంతో జనం విసుగు చెందారు. కనీసం ఎప్పుడు రిజిస్ట్రేషన్లను పునరుద్దరిస్తారో కూడా చెప్పలేకపోయారు. తమ శాఖలో ఆన్‌లైన్ సర్వర్లు ఎప్పుడు, పనిచేస్తాయో, ఎప్పుడు మొరాయిస్తాయో ఎవరికి తెలియదని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులే చెబుతున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు సాక్షులతో కలిపి నలుగురు అవసం అవుతారు. క్రయ, విక్రయదారులతో పాటు మరో ఇద్దరు సాక్షులు రిజిస్ట్రేషన్‌లో ఉంటారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు జనంతో రద్దీగా మారాయి. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సర్వర్లు మొరాయించడంతో నెలకొన్న సమస్యను రెవిన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా దృష్టికి వెళ్లడంతో మాన్యువల్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేపట్టాలని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సూచనలు అందాయి. దీంతో ఉదయం 11 గంటలకు నిలిచిపోయిన లావాదేవీలు సాయంత్రం నాలుగు గంటల సమయంలో పునరుద్ధరించారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సేవల్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో లావాదేవీలు అధికంగా జరిగే సమయంలో ఒక్కసారిగా సర్వర్లు క్రాష్ అవుతున్నాయి. ఉదయం 11 గంటల తర్వాత మ్యారేజీ రిజిస్ట్రేషన్లు, స్టాంప్ పేపర్ల విక్రయాలు, ఆన్‌లైన్ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అందించే ఇతర లావాదేవీలు, సేవలతో సర్వర్లు మొరాయిస్తున్నాయి. ట్రాఫిక్‌కు అనుగుణంగా వాటి సామర్థ్యాన్ని పెంచుకోక పోవడంతో ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సర్వర్లు పనిచేయక పోతే ఏమి చేయాలనే విషయంలో స్పష్టత లేక పోవడంతో సబ్ రిజిస్ట్రార్ స్థాయి అధికారులు కూడా చేతులెత్తేస్తున్నారు. మాన్యువల్ విధానంలో రిజిస్ట్రేషన్లు చేసే సదుపాయం అందుబాటులో ఉన్నా దానిని వినియోగించుకోవడం లేదు.

# ఎట్టకేలకు ప్రభల తీర్థానికి గుర్తింపు



కాకినాడ, ఫిబ్రవరి 20, నాలుగు శతాబ్ధాల నాటి ఉత్సవమది. ఎన్నో తరాల నుంచి సంప్రదాయంగా కొనసాగిస్తోన్న మహోత్సవం. నేటికీ ఏ మాత్రం తగ్గని భక్తిపారవశ్యం. తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా జరిగే తీర్థమహోత్సవం. అదే జగ్గన్నతోట ప్రభల తీర్థ మహోత్సవం. లక్షల మంది భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగే ఈ ప్రభల తీర్థమహోత్సవం ఎంతో ప్రత్యేకం. పచ్చని తీవాచీ పరిచినట్లుగా ఉండే కోనసీమ నేలపై జరిగే ఈ వేడుక చూసేందుకు దేశ విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు తరలి వస్తారు. అద్భుత ఘట్టం కోసం ఎదురు చూస్తు ఉంటారు. ఇప్పుడు ఈ ఉత్సవం రాష్ట్ర పండుగగా మారబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఛైర్మన్ పి.తేజస్వి ఈ మధ్య సమావేశమయ్యారు. జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించాలని ఓ నివేదిక అందించారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు ఆమె తెలిపారు. దీనిపై కోనసీమ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంబాజీపేట మండల పరిధిలోకి వచ్చే జగ్గన్నతోట కేవలం ఖాళీ కొబ్బరి తోట మాత్రమే. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని కనుమ రోజున జరిగే ఈ వేడుకకు వేలాది మంది భక్తులు తరలి వస్తారు. ఏకాశ రుద్రులుగా పిలిచే ప్రభలు అక్కడికి తరలిరాగా వారిని సమావేశపరిచి తిరిగి వెళ్లిపోవడమే ఈ తీర్థమహోత్సవంలోని ప్రధాన ఘట్టం. కేవలం తీర్థమహోత్సవం రోజునే అక్కడ ఇసుక వేస్తే రాలనంత మంది భక్తులు తరలి వస్తారు. ఇది నాలుగు శతాబ్ధాలుగా జరుగుతుండగా ఇక్కడికి తీసుకువచ్చే ప్రభలను భుజాలపై మోసుకురావడం, పంటచేలు, కౌశిక కాలువలను దాటించుకుంటూ రావడం మరో ప్రత్యేకం.. మకర సంక్రమణ ఉత్తరాయణ మహా పుణ్యకాలంలో కనుమ నాడు కోనసీమలోని మొసలిపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల సమాగమం ప్రాచీనమైనది. ప్రాచీన కాలంలో మొట్టమొదటిగా ఈ తోటలోనే ఈ పదకొండు గ్రామాల రుద్రులు సమావేశమయ్యారని ప్రతీతి. ఈ తోటలో ఏ విధమైన గుడి గానీ, గోపురం గానీ ఉండదు. ఇది పూర్తిగా కొబ్బరితోట. ఈ ఏకాదశరుద్రులు సంవత్సరానికి ఒకసారి ఇక్కడ సమావేశం అవ్వడంతో ఈ తోట విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. ఇది ఏకాదశరుద్రుల కొలువు. హిందూధర్మశాస్త్రాల ప్రకారం.. ఏకాదశరుద్రులు ఒక్కచోట కొలువు తీరేది ప్రపంచం మొత్తం మీదా ఒక్కచోటే అదీ వేదసీమ అయినటు వంటి కోనసీమలోనే అంటారు. లోక కల్యాణార్థం ఈ పదకొండు గ్రామాల శివుళ్లు జగ్గన్నతోటలో సమావేశమై లోక విషయాలు చర్చిస్తారని ప్రతీతి. సుమారు 425 సంవత్సరాల క్రితం నుంచి ఈ సంప్రదాయం ఉందనీ తీవ్రమైన పరిస్థితులు వచ్చిన 17వ శతాబ్దంలో ఈ 11 గ్రామాల రుద్రులు ఈ తోటలోనే సమావేశమై లోక రక్షణ చేపట్టారని అంటారు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతీ ఏటా కనుమ రోజు ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఈ రుద్రులను ఒక్కచోట చేర్చుతారు ఈ గ్రామస్తులు. జుకు చెందిన ఈ తోట జగ్గన్నతోట స్థిరపడింది. జగ్గన్నతోట ప్రభల తీర్థానికి అరుదైన గుర్తింపు లభించింది. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'ఉత్సవ్' విభాగంలో ఈవెంట్ అండ్ ఫెస్టివల్స్ జాబితాలో స్థానం దక్కింది.

# అరెస్ట్ లకు సిద్దంగా ఉండండి...

విజయవాడ, ఫిబ్రవరి 20, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పార్టీ నేతలకు కీలక సందేశం ఇచ్చినట్లయింది. మిగిలిన నేతలు కూడా జైలుకు వెళ్లే అవకాశాలు లేకపోలేదని, మానసికంగా సిద్ధమవ్వాలని కూడా ఆయన పరోక్షంగా చెప్పినట్లయింది. నిన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని పరామర్శించేందుకు విజయవాడ జిల్లా జైలుకు వచ్చిన ఆయన మాట్లాడిన మాటలు ఈ సంకేతాలు పంపినట్లయింది. కొడాలి నాని, దేవినేని అవినాష్ పేర్లను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించి చంద్రబాబు, లోకేష్ లు వీరి అరెస్ట్ లకు కూడా సిద్ధపడతారని చేసిన కామెంట్స్ ఇప్పుడు పార్టీలోనే కాదు బెజవాడ రాజకీయాల్లోనూ చర్చనీయాంశమయ్యాయి. సొంత సామాజికవర్గం నేతలు తమకు మద్దతు ఇవ్వకపోతే చంద్రబాబు ఊరుకోరని, అరెస్ట్ చేస్తారని జగన్ అన్నారంటే తర్వాత లిస్ట్ లో వీరిద్దరూ ఉన్నట్లేనని పార్టీ నేతలు కూడా దాదాపుగా ఫిక్స్ అయినట్లే కనపడుతుంది.. అయితే అరెస్ట్ అవ్వడం వంటివి సాధారణంగానే చూడాలని జగన్ పర్యటనలో కొడాలి నాని చేసిన వ్యాఖ్యలు కూడా అదే అర్థం చెబుతున్నాయి. అంటే తాము అరెస్ట్ కు సిద్ధంగా ఉన్నామని వారు చెబుతున్నారు. తాను యాక్టివ్ గా లేనని ప్రచారం జరుగుతుందని, అజ్ఞాతంలోకి వెళ్లానని కొందరు పనిగట్టుకుని సోషల్ మీడియాలో, ప్రధాన మీడియాల్లో వార్తలు పోస్టు చేస్తున్నారని, కానీ అధికారంలో లేనప్పుడు యాక్టివ్ గా ఎలా ఉంటామని ఆయన ప్రశ్నించారు. తన చుట్టూ ఉన్న న్యాయవాదులను చూపించి వీరున్నారుగా వారు చూసుకుంటారులే అని అన్నారు. రెడ్ బుక్ అనేది తాను చూడలేదని, అయినా ఏ బుక్కు తమను ఏం చేయలేమని, తాము జగన్ ను వదిలి వేరే పార్టీలోకి అడుగు పెట్టే ప్రసక్తి లేదని కొడాలి నాని స్పష్టం చేశారు. మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాష్ కూడా నిందితుడిగా ఉన్నారు. అవినాష్ పై కేసు నమోదు చేసిన పోలీసులు లుక్ అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు. దేవినేని అవినాష్ గత ఎన్నికలకు ముందు టీడీపీ నుంచి వైసీపీలోకి చేరి విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అవినాష్ తండ్రి దేవినేని నెహ్రూ పేరిట ఉన్న రహదారికి తిరిగి మహానాడు రోడ్డుగా ప్రభుత్వం నామకరణం చేసింది. ఇలా దేవినేని అవినాష్ విషయంలో కొంత అధినాయకత్వం ఆగ్రహంతో ఉందని, త్వరలోనే ఆయన కూడా అరెస్ట్ అవుతారని జగన్ చెప్పకనే చెప్పినట్లయింది. దీంతో బెజవాడ వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా జైలుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పడంతో దేవినేని కూడా రెడీ అవ్వాల్సిందే. . వీరే కాదు వైసీపీలో కీలక నేతలు, గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారితో పాటు సామాజికవర్గంగా బలంగా ఉన్న నేతలను కూటమి ప్రభుత్వం టార్గెట్ చేస్తుందని వైసీపీ నేతలు ముందుగానే అంచనా వేసుకున్నారు. అందుకు తగినట్లుగానే వారు మానసికంగా సిద్ధమయ్యారు. నందిగం సురేష్ తో మొదలయిన అరెస్ట్ ల పర్వం ఇక ఆగదని కూడా తెలుసు. అందుకు రెడీ అయిపోవడం మంచిదన్న భావనకు వచ్చారు. అరెస్టయి జైలుకు వెళ్లి వస్తే సానుభూతి వస్తుందని, తమకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఆ నియోజకవర్గంలో ఖచ్చితంగా దక్కుతుందని కూడా నేతలు సిద్ధమవుతున్నారు. అందుకే నాలుగు గోడల మధ్య నాలుగైదు నెలలు ఉంటే పోయేదేముంది? అన్న భావనకు వచ్చినట్లే కనపడుతుంది.

# సూర్యలంకకు పోటెత్తున్నారో...

ఒంగోలు, ఫిబ్రవరి 20,నీటిని చూస్తే చిన్నపిల్లల నుంచి పెద్దల వరకూ పులకించిపోతారు. అందులోనూ బీచ్ లో గడపటమంటే ఏ మాత్రం వెనకాడరు. అలలు చూస్తే ఇక వయసు ఆగదు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్న బీచ్ లకు వెళ్లి అక్కడే గంటల కొద్దీ గడిపే వారు ఎంతో మంది ఉన్నారు. దీని వల్ల టూరిజం అభివృద్ధి చెందుతుంది. బీచ్ లకు వెళ్లాలంటే గోవాకు వెళ్లాల్సిందే. అక్కడ అందుబాటులో బీచ్ లు ఉండటంతో పాటు అన్ని రకాల వసతులు, మనసుకు ఆహ్లాదకరమైన వాతావరణం వెరసి గోవాకు బీచ్ లే పెద్ద అస్సెట్ గా మారాయనడంలో సందేహం లేదు. విదేశీయుల నుంచి ఇతర రాష్ట్రాల పర్యాటకులతో గోవా బీచ్ లు ఎప్పుడూ సందడిగా మారుతుంటాయి. టూరిజంపై వచ్చే ఆదాయంతోనే గోవా ప్రభుత్వం నడుస్తుందనడంలో అతిశయోక్తి లేదు. అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా టూరిజం అభివృద్ధిలో భాగంగా బీచ్ లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అమరావతికి దగ్గరలోనే సహజ సిద్ధమైన సూర్యలంక బీచ్ ను ముస్తాబు చేస్తున్నారు. పర్యాటకుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏపీ సర్కార్ సిద్ధమవుతుంది. రాజధాని అమరావతికి దగ్గరలో ఉన్న ఏకైక బీచ్ ఇదే కావడంతో దీనికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. నాలుగు కిలోమీటర్ల పొడవున సహజ సిద్ధమైన బీచ్ విస్తరించి ఉండటం సూర్యలంక బీచ్ ప్రత్యేకత. రాజధాని అమరావతికి కేవలం 70 నుంచి 80 కిలో మీటర్ల దూరంలోనే ఈ బీచ్ ఉండటంతో దానిని మరింత అభివృద్ధి చేస్తే పర్యాటకంగా లబ్ది చేకూరుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే సూర్యలంక బీచ్ కు అనేక మంది పర్యాటకులు వచ్చిపోతున్నారు. అయితే తెలిసిన వాళ్లు మాత్రమే అక్కడికి వస్తుంటారు. కేవలం దగ్గర ప్రాంతాల వారు మాత్రమే ఇక్కడకు వచ్చి వెళుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో పెద్దగా అభివృద్ధి చెందడం లేదు. దీంతో ఈ బీచ్ లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నలభై లక్షలరూపాయలను వెచ్చించాలని నిర్ణయించింది. బాపట్ల సూర్యలంక బీచ్ అంటే అక్కడ ప్రకృతిసిద్ధమైన ఎన్నో మధురానుభూతులు లభించే అవకాశం ఉండటంతో పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. దీంతో పాటు అక్కడ డ్రెస్సింగ్ రూములు, మంచీనీటి పంపులు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. దీంతో సూర్యలంక బీచ్ కు మహర్దశ పట్టనుంది. మరిన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. రోజుకు ఐదు వేల మంది పర్యాటకులు వస్తారన్న అంచనాతో సదుపాయలు కల్పిస్తున్నారు.

# మునిసిపల్ మాజీ కౌన్సిలర్ భర్త దారుణ హత్య


జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నాగవల్లి సరళ భర్త రాజ లింగమూర్తి పై గుర్తుతెలియని దుండగులు కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేశారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు లింగమూర్తిని ఆసుపత్రికి తరలించారు. రాజలింగమూర్తి మేడిగడ్డ ప్రాజెక్టు విషయంలో అవినీతి జరిగిందని మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తో పాటు పలువురిపై భూపాలపల్లి కోర్టులో పిటిషన్ వేసిన వ్యక్తి. రాజలింగమూర్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అందం కోసం నెయిల్ పాలిష్ వాడుతున్నారా.. ఈ క్యాన్సర్లు రావడం పక్కా!




నెయిల్ పాలిష్‌ను మహిళలు ముఖ్యంగా తమ అందాన్ని పెంచుకోవడానికి ఉపయోగిస్తారు. వివిధ రంగులు, డిజైన్‌లు అందుబాటులో ఉండటంతో, చాలా మంది దీన్ని అందం కోసం తప్పనిసరిగా ఉపయోగిస్తున్నారు. అయితే, దీని వినియోగం వల్ల కొన్ని అనర్థాలు కూడా కలగవచ్చు. నెయిల్ పాలిష్‌లో ఉండే రసాయనాలు, దీన్ని తొలగించేందుకు ఉపయోగించే నెయిల్ రిమూవర్లు, దీర్ఘకాలిక ఉపయోగం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను గమనించాలి. అవేంటో చూద్దాం.. కెమికల్ ఎలర్జీలు : నెయిల్ పాలిష్‌లో ఫార్మాల్డిహైడ్, టోల్యూయిన్, డిబ్యూటైల్ ఫథాలేట్ (ఆఃఖ) వంటి హానికరమైన రసాయనాలు ఉంటాయి. ఇవి కొంతమందిలో అలర్జీ రియాక్షన్లు కలిగించవచ్చు. కొంతమంది నెయిల్ పాలిష్ వేసిన వెంటనే దద్దుర్లు, చర్మం ఎర్రబారటం, పొక్కులు వంటి సమస్యలను ఎదుర్కొంటారు. ముఖ్యంగా సున్నితమైన చర్మం ఉన్నవారికి ఈ రసాయనాలు హాని కలిగించవచ్చు. నెయిల్ పాలిష్‌ను తరచుగా వాడడం వల్ల గోర్లు బలహీనపడతాయి. పాలిష్‌లోని రసాయనాలు గోర్లలో తేమను తగ్గించి అవి పగిలిపోయేలా చేస్తాయి. దీన్ని నివారించడానికి, నెయిల్ పాలిష్ వాడకానికి మధ్య విరామం ఇవ్వడం ఉత్తమం శ్వాసకోశ సమస్యలు: నెయిల్ పాలిష్ నుండి వచ్చే వాసన కొంతమందికి ఊపిరితిత్తుల సమస్యలు కలిగించవచ్చు. దీర్ఘకాలికంగా ఈ రసాయనాల వాసన పీల్చడం వల్ల మైగ్రేన్ తలనొప్పి, తల తిరగడం, అనారోగ్య సూచనలు కలగవచ్చు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు , శ్వాసకోశ సమస్యలతో బాధపడే వారు నెయిల్ పాలిష్ వాసన తక్కువ ఉండే ప్రోడక్టులను ఎంచుకోవడం మంచిది. కొంతమంది నెయిల్ పాలిష్‌ను ఎక్కువగా వాడడం వల్ల గోర్లు పసుపు రంగులోకి మారిపోతాయి. ఇది ప్రధానంగా డార్క్ కలర్స్ ఎక్కువగా ఉపయోగించినప్పుడు జరుగుతుంది. హార్మోన్ అసమతుల్యత : కొన్ని అధ్యయనాలు నెయిల్ పాలిష్‌లోని ఫథాలేట్స్ వంటి రసాయనాలు శరీరంలోని హార్మోన్లను ప్రభావితం చేయగలవని సూచిస్తున్నాయి. దీని వల్ల గర్భధారణ సమస్యలు, హార్మోన్ ఇంబ్యాలెన్స్, తక్కువ ఫెర్టిలిటీ వంటి సమస్యలు తలెత్తవచ్చు. గర్భిణీ స్త్రీలు, పిల్లలు ఎక్కువగా నెయిల్ పాలిష్ వాడకూడదు. ఫార్మాల్డిహైడ్ వంటి కొన్ని రసాయనాలు దీర్ఘకాలికంగా నెయిల్ పాలిష్‌లో ఉండడం వల్ల క్యాన్సర్ కారకంగా మారే అవకాశం ఉంది. అయితే, చాలా కంపెనీలు ఇప్పుడు ఫార్మాల్డిహైడ్-ఫ్రీ నెయిల్ పాలిష్‌లు అందుబాటులోకి తెస్తున్నాయి. నెయిల్ పాలిష్ రిమూవర్ హాని : నెయిల్ పాలిష్ తొలగించడానికి ఉపయోగించే ఏసిటోన్ బేస్డ్ రిమూవర్లు గోర్ల ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ఏసిటోన్ గోర్లలోని సహజ తేమను తొలగించి అవి పొడిగా మారేలా చేస్తుంది. దీని వల్ల గోర్లు విరిగిపోవడం మరింత ఎక్కువగా మారడం జరుగుతుంది. సాధ్యమైనంత వరకు నాన్-ఏసిటోన్ రిమూవర్‌ను ఉపయోగించడం ఉత్తమం. నెయిల్ పాలిష్‌ని తరచుగా ఉపయోగించడం వల్ల గోళ్ల చుట్టూ ఉండే చర్మం దెబ్బతిని, ఇన్ఫెక్షన్లకు గురయ్యే ప్రమాదం ఉంది నెయిల్ పాలిష్ అందాన్ని పెంచే సాధనమే అయినప్పటికీ, దీని వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను కూడా అర్థం చేసుకోవాలి. సహజమైన, కెమి కల్-ఫ్రీ నెయిల్ పాలిష్‌లను ఎంచుకోవడం, గోర్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అవసరం. అప్పుడే మనం అందాన్ని పరిరక్షించుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోగలం. గోళ్లను ఆరోగ్యంగా ఉంచడానికి విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉండే ఆహారం తీసు కోండి.

# అల్సర్లతో అల్లాడుతున్నారా? ఫస్ట్ ఏం తినాలో తినకూడదో తెలుసుకోండి.!



అల్సర్లు అన్నవాహిక, కడుపు లేదా చిన్న ప్రేగు యొక్క లోపలి పొరలో ఏర్పడే పుండ్లు. ఇవి సాధారణంగా హెలికోబాక్టర్ పైలోరి (ఊ. పైలోరి) అనే బ్యాక్టీరియా వల్ల లేదా నాన్-స్టెరాయిడల్ యాంటీ ఇన్ఫ్లమేటరీ డ్రగ్స్ వంటి కొన్ని మందుల వాడకం వల్ల వస్తాయి. అల్సర్ల చికిత్సలో సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. కొన్ని ఆహారాలు అల్సర్లను నయం చేయడానికి, నొప్పిని తగ్గించడానికి , పరిస్థితిని మరింత దిగజార్చకుండా నిరోధించడానికి సహాయపడతాయి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం: సులభంగా జీర్ణమయ్యే ఆహారాలను ఎంచుకోవడం చాలా ముఖ్యం. ఉడికించిన కూరగాయలు, మెత్తని అన్నం, అరటిపండ్లు , యాపిల్ సాస్ వంటి ఆహారాలు కడుపుపై ఒత్తిడిని తగ్గించి, జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. వేయించిన , జిడ్డుగల ఆహారాలకు దూరంగా ఉండాలి, ఎందుకంటే అవి జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి . అల్సర్లను మరింత తీవ్రతరం చేస్తాయి. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి. ఇవి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి ఆహారాలలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, తద్వారా అల్సర్ల నుండి ఉపశమనం లభిస్తుంది. విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారం: విటమిన్ ఎ కణాల పునరుత్పత్తికి మరియు శోథ నిరోధక లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. క్యారెట్లు, బచ్చలికూర , చిలగడదుంపలు వంటి ఆహారాలలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. విటమిన్ ఎ అల్సర్లను నయం చేయడానికి మరియు కడుపు యొక్క లైనింగ్‌ను రక్షించడానికి సహాయపడుతుంది. ప్రోబయోటిక్స్ ఆరోగ్యకరమైన బ్యాక్టీరియాను కలిగి ఉంటాయి, ఇవి జీర్ణవ్యవస్థను మెరుగుపరచడానికి సహాయపడతాయి. పెరుగు , పులియబెట్టిన ఆహారాలలో ప్రోబయోటిక్స్ అధికంగా ఉంటాయి. నీరు - ఇతర ద్రవాలు: తగినంత నీరు త్రాగటం చాలా ముఖ్యం, ఎందుకంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. మూలికా టీలు, కొబ్బరి నీరు వంటి ఇతర ద్రవాలు కూడా అల్సర్లకు ఉపశమనం కలిగిస్తాయి. కార్బోనేటేడ్ పానీయాలు కడుపులో గ్యాస్‌ను పెంచుతాయి. అల్సర్లను మరింత అసౌకర్యంగా చేస్తాయి. సోడా, ఇతర కార్బోనేటేడ్ డ్రింక్స్‌ను నివారించాలి. కారంగా ఉండే ఆహారాలు అల్సర్లను మరింత తీవ్రతరం చేస్తాయి . నొప్పిని పెంచుతాయి. మిరపకాయలు, కారం, ఇతర స్పైసీ మసాలా దినుసులకు దూరంగా ఉండాలి. 00:00 / 01:30 తీసుకోకూడని ఆహారాలు: సిట్రస్ పండ్లు, టమోటాలు వంటి పుల్లని ఆహారాలు కడుపులో ఆమ్లతను పెంచుతాయి . అల్సర్లను మరింత బాధాకరంగా చేస్తాయి. కెఫిన్ , ఆల్కహాల్ కడుపులో ఆమ్ల ఉత్పత్తిని పెంచుతాయి. అల్సర్లను నయం చేయకుండా నిరోధిస్తాయి. కాఫీ, టీ , ఆల్కహాల్‌ను నివారించాలి. ప్రాసెస్ చేసిన ఆహారాలలో ఉప్పు, చక్కెర, కొవ్వు అధికంగా ఉంటాయి, ఇవి అల్సర్లను మరింత తీవ్రతరం చేస్తాయి. ఫాస్ట్ ఫుడ్, ప్యాక్ చేసిన స్నాక్స్‌కు దూరంగా ఉండాలి.

# నిద్రలేని రాత్రులు వేధిస్తున్నాయా? ఒక్క గ్లాసు ఇది తాగితే చాలు..


పసుపు పాలు, దీనిని "గోల్డెన్ మిల్క్" అని కూడా పిలుస్తారు, ఇది ఒక సాంప్రదాయ భారతీయ పానీయం, ఇది శతాబ్దాలుగా దాని ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందింది. పసుపును పాలలో మరిగించి తయారు చేస్తారు, తరచుగా అల్లం, దాల్చినచెక్క , నల్ల మిరియాలు వంటి ఇతర సుగంధ ద్రవ్యాలు కలుపుతారు. ఈ పానీయం రాత్రిపూట నిద్రకు ముందు తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మెరుగైన నిద్ర: పసుపులో కర్కుమిన్ అనే క్రియాశీల సమ్మేళనం ఉంటుంది, ఇది శోథ నిరోధక, యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది, ఇది తరచుగా నిద్రలేమికి కారణమవుతుంది. పసుపు పాలు మెదడును ప్రశాంతపరుస్తుంది, ఒత్తిడిని తగ్గిస్తుంది, నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్,యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. పసుపు పాలు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జలుబు, ఫ్లూ , ఇతర ఇన్ఫెక్షన్ల నుండి మిమ్మల్ని రక్షించుకోవచ్చు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: పసుపు పిత్త ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది, ఇది కొవ్వులను జీర్ణం చేయడానికి అవసరం. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో , మలబద్ధకం, ఉబ్బరం మరియు గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపులోని కర్కుమిన్ సహజ నొప్పి నివారిణిగా పనిచేస్తుంది. ఇది కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు మరియు తలనొప్పి వంటి దీర్ఘకాలిక నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపు పాలు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది: పసుపు పాలు మెదడులో డోపమైన్ , సెరోటోనిన్ స్థాయిలను పెంచుతాయి, ఇవి మానసిక స్థితిని మెరుగుపరచడానికి , ఆందోళనను తగ్గించడానికి సహాయపడతాయి. ఇది జ్ఞాపకశక్తిని , అభిజ్ఞా పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. పసుపులోని యాంటీఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి మరియు చర్మంపై ముడతలు మరియు మచ్చలను తగ్గించడంలో సహాయపడతాయి. పసుపు పాలు చర్మాన్ని ప్రకాశవంతంగా మరియు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది: పసుపు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో , రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది, ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పసుపు పాలు రక్త నాళాల పనితీరును మెరుగుపరచడంలో , గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. కొన్ని అధ్యయనాలు పసుపులోని కర్కుమిన్ క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించగలదని సూచిస్తున్నాయి. అయితే, ఈ అంశంపై మరింత పరిశోధన అవసరం.' పసుపు పాలు తయారు చేయడం సులభం , రుచికరమైనది. మీరు దీన్ని వివిధ రకాల పాలు , సుగంధ ద్రవ్యాలతో తయారు చేసుకోవచ్చు. ఉత్తమ ఫలితాల కోసం, సేంద్రీయ పసుపు , తాజా పదార్థాలను ఉపయోగించడం మంచిది. పసుపు పాలు సాధారణంగా సురక్షితమైనవి, అయితే మీరు ఏదైనా మందులు తీసుకుంటుంటే లేదా ఆరోగ్య సమస్యలు ఉంటే, దానిని క్రమం తప్పకుండా తీసుకునే ముందు మీ వైద్యుడిని సంప్రదించడం మంచిది.



# పెరుగుతో బరువుకు చెక్... ఇంకా బోలెడు అద్భుత ప్రయోజనాలు!



చాలామంది విపరీతమైన బరువుతో బాధపడుతూ బరువు తగ్గడం కోసం నానా తంటాలు పడుతూ ఉంటారు. అంటే బరువు తగ్గి నాజూకుగా మారాలి అనుకుంటే కొన్ని ఆహార పదార్థాలను తప్పకుండా తీసుకోవాలి. మీకు అటువంటి ఆహారాలలో పెరుగు ఒకటి. పెరుగుతో బరువు తగ్గటం మాత్రమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. మరి పెరుగుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గురించి ప్రస్తుతం తెలుసుకుందాం  పెరుగు తింటే బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు సీజన్ ఏదైనా సరే ప్రతీ ఒక్కరూ పెరుగు తీసుకుంటే మనకి అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి .రోజువారి ఆహారంలో భాగంగా పెరుగును తీసుకోవడం ఎంతో మంచిది.. పెరుగులో మెగ్నీషియం, క్యాల్షియం , విటమిన్లు ఉంటాయి. పెరుగు మన శరీరంలో మంచి బ్యాక్టీరియాని వృద్ధి చేస్తుంది. గట్ హెల్త్ ను పెంచుతుంది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరిచి మలబద్ధకాన్ని నివారిస్తుంది. పెరుగుతో ఈ అనారోగ్యాల నుండి రక్షణ ప్రతిరోజు మనం పెరుగు తీసుకోవడం వల్ల ఇందులో ఉండే ప్రోబయోటిక్ అనేక అనారోగ్య సమస్యలను అదుపులో ఉంచుతాయి. ముఖ్యంగా మూత్రపిండాల వ్యాధులతో బాధపడేవారు పెరుగు తినడం వల్ల కొంతమేర ఒక ఉపశమనం పొందుతారు. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గించి, రక్త సరఫరాను సమన్వయం చేస్తాయి. పెరుగు తినటం వలన గుండె జబ్బుల ప్రమాదం నుండి రక్షణ పొందుతారు. పెరుగులో నల్లమిరియాల పొడి కలిపి తీసుకుంటే బెనిఫిట్ పెరుగులో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది . ఇక పెరుగులో నల్ల మిరియాల పొడిని కలుపుకుని తింటే ఎముకలకు బలం చేకూరుతుంది. జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. అలెర్జీలు, అధిక రక్తపోటు, ఉబ్బసం వంటి సమస్యలు ఉన్నవారు నల్ల మిరియాల జోలికి పోకుండా ఉంటేనే మంచిది. ఖనీలివతీవట ఃఎ బరువు తగ్గేందుకు పెరుగు బెస్ట్ పెరుగులో ప్రో బయోటిక్స్ , యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. దీనిని నల్ల మిరియాల పొడితో కలిపి తింటే బరువు తగ్గటానికి వీలు అవుతుంది. శరీరాకృతి కోసం వ్యాయామాలు చేసే వారు కూడా పెరుగును ఆహారంలో భాగం చేసుకుంటే సన్నగా నాజూగ్గా మారే అవకాశం ఉంది. పెరుగు ఆహారంలో భాగంగా చేసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఇక చర్మ ఆరోగ్యానికి, కేశాల ఆరోగ్యానికి కూడా పెరుగు దోహదం చేస్తుంది. టతిబఇశ్రీజీతిఎవతీ: ఈ కథనం వైద్య నిపుణుల సూచనలు మరియు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న అంశాల ఆధారంగా రూపొందించబడింది. నీనివతినిటతిజీ దీనిని ధృవీకరించలేదు.




# మలయాళ ఇండస్ట్రీ కీర్తిని గౌరవాన్ని 'మార్కో' తగ్గించిందా?


ఉన్ని ముకుందన్ కథానాయకుడిగా నటించిన భారీ యాక్షన్ చిత్రం 'మార్కో' పాన్ ఇండియాలో గ్రాండ్ సక్సెస్ అందుకున్న సంగతి తెలిసిందే. ఒక లోబడ్జెట్ సినిమా అసాధారణ విజయం సాధించడం వెనక కారణాన్ని ఆర్జీవీ తనదైన శైలిలో విశ్లేషించారు. ఈ సినిమా కోసం ఉపయోగించిన స్క్రీన్ ప్లే మ్యాజిక్ గురించి, యాక్షన్ సన్నివేశాల్ని మలిచిన తీరు గురించి అతడు అద్భుతంగా వర్ణించాడు. దక్షిణాది సినీ పరిశ్రమలో దర్శకులు చేయకూడని



తప్పుల గురించి ఆర్జీవీ విశ్లేషించారు. తెలుగు సినిమా హిస్టరీలో ఎన్నటికీ నిలిచిపోయే క్లాసిక్ సినిమాలను అందించిన రామ్ గోపాల్ వర్మ, ఇటీవల చెత్త సినిమాలు తీస్తున్నారని విమర్శల్ని ఎదుర్కొన్నా కానీ, ఆయన ఇతరుల సినిమాలను నిజాయితీగా విశ్లేషిస్తుంటే దానిపై ప్రశంసలు కురుస్తున్నాయి. పింక్‌విల్లాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దక్షిణాది దర్శకులు తమ సినిమాలను మేధోమథనం చేయడం గురించి పట్టించుకోరని రాము అన్నారు. దక్షిణాది దర్శకులు సన్నివేశాలను మాత్రమే చూస్తారు.. కథ గురించి పట్టించుకోరు. ఒక పెద్ద నటుడు ఒకసారి నాతో "నేను ఎప్పుడూ కథ వినను.. నా ప్రశ్న, మేరా ఎంట్రీ క్యా హై?" అని అన్నారని తెలిపాడు. ఎస్ఎస్ రాజమౌళి చిత్రాల నుండి ప్రేరణ పొంది సినిమాలు తీసిన దర్శకులను కూడా ఆయన విమర్శించారు. సలార్: పార్ట్ 1 – సీజ్‌ఫైర్, కల్కి 2898 ఏడి, కాంతారా నుంచి ప్రేరణ పొంది సినిమాలు తీస్తున్నారని రాము అన్నారు. మలయాళంలో ప్రశంసలు పొందిన సినిమాల తప్పుల నుంచి నేర్చుకుని మార్కో ఎదిగాడని కూడా రాము తనదైన శైలిలో మాలీవుడ్ పై పంచ్ వేసారు. ఉన్ని ముకుందన్ సింగిల్ హ్యాండెడ్ గా మలయాళ ఇండస్ట్రీ కీర్తిని తుంగలోకి తొక్కాడని ఆర్జీవీ వ్యంగ్య శైలిలో అన్నారు. మార్కో గురించి అద్భుతమైన విషయం ఏమిటో ఆర్జీవీ చర్చించారు. ఆ సినిమాలో రెచ్చగొట్టే హింస కాదు. దర్శకుడు ఆలోచనలు ఎల్లపుడూ విషయం లేని ఖాళీ దృశ్యాల కంటే శక్తివంతమైనవి. ఎంత నాటకీయంగా సన్నివేశాన్ని చిత్రీకరించారు అన్నది కీలకం. అత్యంత వివాదాస్పదమైన ఎ సెర్బియన్ ఫిల్మ్‌లోని అత్యంత దురదృష్టకరమైన సన్నివేశం దానిలోని రాజకీయ వ్యాఖ్యానం కారణంగా మాత్రమే వర్కవుటైంది. మార్కోలో, గర్భిణీ స్త్రీ హత్య ఆమె బిడ్డపై విధించిన మరణ దండన హింస ఖండించదగినవి... కానీ అది అంతే. హింస గురించి లేదా దానికి మన ప్రతిస్పందన గురించి ఈ చిత్రాన్ని తెరకెక్కించిన వారికి ఏమీ చెప్పనవసరం లేదు. క్రూరత్వానికి క్రూరత్వం గుణపాఠం. అత్యంత నిర్లక్ష్య రకమైన గుడ్డి మారణహోమం. అయితే దీని గురించి ఫిర్యాదు చేయడం అన్యాయం అవుతుంది. మార్కో లోతు కోసం ప్రయత్నించడు. లేదా అది ఉన్నత కళ అని చెప్పుకోడు. కానీ ఈ సినిమాలో కథ చెప్పడంలో లోపాలను ఎత్తి చూపడం న్యాయమైన చర్య అవుతుందని ఆర్జీవీ అన్నారు.దర్శకరచయిత హనీఫ్ అదేని 'మార్కో' కోసం అత్యంత హాస్యాస్పదమైన సృజనాత్మక నిర్ణయం తీసుకున్నారు. కథానాయకుడిని ప్రేక్షకుల కంటే ఒకటి కాదు, మూడు అడుగులు వెనుక ఉంచడం. ఇది షో మొత్తం ప్రేక్షకుల హృదయాలను దోచుకుంటుంది. ఉదాహరణకు, విక్టర్ అనే అమాయక అంధుడు – అతను మార్కో సోదరుడు – ఒక హత్యను చూసి సాక్ష్యమిచ్చినందుకు హత్యకు గురవుతాడు. దోషులు ఎవరో మనకు వెంటనే తెలుస్తుంది. ఇది సరిపోనట్లుగా, వారు విక్టర్‌ను ఎందుకు చంపారో కూడా మనకు వివరణలు ఇస్తారు. మార్కో తన సోదరుడి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేసినప్పుడు, ప్రేక్షకులు అప్పటికే తెలిసిన వ్యక్తులను గుర్తించడానికి ప్రయత్నిస్తూ అతడి సర్కిల్‌లలో తిరుగుతారు. విలన్ రింగ్‌లీడర్ తన కుమారులలో ఒకరిని మార్కో బృందంలో చేర్చినప్పుడు, అతని దర్యాప్తును పక్కదారి పట్టించేలా విషయాలు మారతాయి. అది బాగా వర్కవుటైంది. ప్రశాంత్ నీల్ ప్లేబుక్ టెక్నిక్స్ ని మార్కో కోసం ఉపయోగించుకున్నారని ఆర్జీవీ అన్నారు. సహాయక పాత్ర ద్వారా ప్రధాన పాత్రను హైప్ చేసే టెక్నిక్ ని మార్కో కోసం ఉపయోగించుకున్నారని ఆర్జీవీ విశ్లేషించారు.

# ఆ మూడు రోజులు నాకు నేనే తోడు

తోడు లేని ఒంటరి జీవితంలో ఆవేదన గురించి సమంత రూత్ ప్రభు నిజాయితీగా మాట్లాడుతుంది. ఒంటరితనం అలవాటైపోయిన వ్యాపకం ఇప్పుడు. ఇలాంటి సమయంలో తమిళనాడు కోయంబత్తూరులోని ఇషా ఫౌండేషన్ లో ధ్యానం, యోగ సాధనతో కొంత ఉపశమనం పొందింది సామ్. సద్గురు వద్ద సాధన చేస్తున్న ఫోటోలు, వీడియోలు కూడా ఇంతకుముందు సోషల్ మీడియాల్లో వైరల్ అయ్యాయి. అంతే కాదు ఆధ్యాత్మికత అంటే అనవసరమైన డిస్ట్రబెన్స్ లేకుండా గడపడం. సమంత గురువు సన్నిధానంలో మూడు రోజులు మౌనంగా ఉంది. "ఫోన్ లేదు.. కమ్యూనికేషన్ లేదు.. నాకు నేను మాత్రమే తోడుగా ఉన్నాను" అని కూడా సమంత వెల్లడించింది. ఏదో ఒక కారణంతో ఒంటరిగా ఉండటం భయానకమైన విషయం. నేను మళ్ళీ దీని నుంచి బయటపడతానా? అంటే.. మిలియన్ సార్లు .. మొబైల్ లేకుండా ఒంటరిగా ప్రయత్నించమని నేను సిఫార్సు చేస్తాను.. లక్షల సార్లు చెబుతాను" అని సమంత అంది. ఒంటరితనం భయపెట్టేదిగా ఉంటుందని కూడా సమంత అంగీకరించింది. మళ్లీ మళ్లీ దీనిని ఇష్టంగా ఎదుర్కొంటానని అంది. సమంత అప్స్ అండ్ డౌన్స్ గురించి.. తన శారీరక, మానసిక ఆరోగ్యం గురించి సోషల్ మీడియాలో అభిమానులతో షేర్ చేసుకోవడానికి ఎప్పుడూ వెనకాడదు. నాగచైతన్యతో ప్రేమ పెళ్లి, విడాకులు, ఆ తర్వాత ఆటో ఇమ్యూన్ వ్యాధి, మయోసిటిస్ తో సమస్యలు ఎన్ని ఉన్నా అన్నిటినీ ఎదుర్కొంది. తాను



ఒంటరిగా ప్రయాణాలు చేస్తున్నా.. మానసికంగా ధృఢంగా మారడానికి అవసరమైన మార్గాలను అన్వేషించింది. మయోసైటిస్ కి చికిత్స తర్వాత ఇప్పటికి చాలా వరకూ దీని నుంచి బయటపడింది. సమంత కెరీర్ మ్యాటర్‌కి వస్తే రాజ్ అండ్ డికె రూపొందిస్తున్న 'రక్త్ బ్రహ్మాండ్'లో నటిస్తోంది. ఇది సమంత నటజీవితంలో మరో వైవిధ్యమైన పాత్ర అని టాక్ వినిపిస్తోంది. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సిరీస్ తో పాటు, తెలుగులో 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని సొంత బ్యానర్ లో ప్రారంభించింది.

# 'మజాకా' బ్యూటీ కోరికలు ఇలా ఉన్నాయ్!



తెలుగు హీరోయిన్ రీతు వర్మ గురించి పరిచయం అవసరం లేదు. సొగసరి ఇప్పటికే తెలుగు, తమిళ్ లో చాలా సినిమాలు చేసింది. 'ప్రేమ ఇష్క్ కాదల్' తో ఎంట్రీ ఇచ్చిన రీతూ చాలా తెలుగు సినిమాలు చేసింది. అటుపై కోలీవుడ్ లోనూ చాలా సినిమాల్లో నటించింది. కానీ రీతూకు ఇంకా టాలీవుడ్ లో రావాల్సినంత గుర్తింపు రాలేదు. ఖాళీ లేకుండా సినిమాలైతే చేస్తుంది గానీ ఫేమస్ కాలేకపోతుంది. ప్రస్తుతం తెలుగులో 'మజాకా' చిత్రంలో నటిస్తోంది. ఇందులో యంగ్ హీరో సందీప్ కిషన్ కి జోడీగా నటిస్తుంది. సినిమాలో అమ్మడు కాస్త రొమాంటిక్ గానూ కనిపించనుందని ప్రచారంలో ఉంది. హీరోతో లిప్ లాక్ లు వేసినట్లు వినిపిస్తుంది. అయితే తాను పోషించాలనుకుంటోన్న పాత్రలు, డ్రీమ్ రోల్స్ ఇంకా అలాగే మిగిలిపోయాయని ప్రచారంలో భాగంగా రివీల్ చేసింది. 'నా సినీ ప్రయణాం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. ఎందుకంటే నేను నటి అవ్వాలని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడు అనుభవిస్తోన్న జీతితమంతా నేను అనుకోకుండా సినిమాల్లోకి రావడంతోనే సాధ్యమైంది. ఆ రకంగా నేను అదృష్టవంతురాలినే. నటిగా చాలా సినిమాల్లో భాగమయ్యాను. వాటిలో గుర్తుంచుకునే కొన్ని పాత్రలున్నాయి. కానీ నాకంటూ కొన్ని డ్రీమ్ రోల్స్ ఉన్నాయి. యాక్షన్ ప్రాధన్యమున్న చిత్రాలు చేయాలని ఉంది. అలాగే పీరియాడిక్ చిత్రాలు..యువరాణి పాత్రల్లో నటించాలన్నది ఎప్పటి నుంచో ఉన్న కోరిక. 'మజాకా'తో కామెడీ సినిమా కూడా చేస్తున్నా. ప్రస్తుతం తెలుగులో ఓ మల్టీస్టారర్ సినిమా చేస్తున్నా'అని తెలిపింది. అయితే ఆ మల్టీస్టారర్ వివరాలు మాత్రం రీతూ రివీల్ చేయలేదు. అలాగే 'శ్రీకారం' ఫేం కిషోర్ దర్శకత్వంలో ఓ వెబ్ సిరీస్ కూడా చేస్తున్నట్లు రివీల్ చేసింది.

# 'అనగనగా ఒక రాజు' ఎప్పుడు వస్తున్నాడంటే?

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోస్ లిస్ట్ లో నవీన్ పోలిశెట్టి పేరు కచ్చితంగా ఉంటుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. ఆయన కామెడీ టైమింగ్ కు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అంతలా ఆయన ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నారు. కానీ స్క్రీన్ పై కనిపించి లాంగ్ గ్యాప్ వచ్చిన విషయం తెలిసిందే. చివరగా అనుష్క హీరోయిన్ గా యాక్ట్ చేసిన మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు నవీన్ పోలిశెట్టి. ఆ సినిమాతో మంచి హిట్ ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇప్పుడు అనగనగా ఒక రాజుతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో మూవీ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. వాస్తవానికి.. అనగనగా ఒక రాజు మూవీ అనౌన్స్మెంట్ వచ్చి చాలా కాలం అయింది. ఆ తర్వాత షూటింగ్ స్టార్ట్ అయ్యాక మూవీ ఆపేసినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఇటీవల సినిమాను మళ్లీ స్టార్ట్ చేసినట్లు నిర్మాత నాగవంశీ ప్రకటించారు. నవీన్.. ఆ మధ్య ప్రమాదానికి గురై కోలుకుని మళ్లీ సెట్స్ లోకి అడుగుపెట్టారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాను సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరీ హీరోయిన్ గా నటిస్తున్నారు. మేకర్స్ గతంలో ఓ గ్లింప్స్ ను రిలీజ్ చేయగా.. లాంగ్ గ్యాప్ తర్వాత టీజర్ ను రిలీజ్ చేసి హైప్ క్రియేట్ చేశారు



# వార్2కు వాయిదా తప్పదా?

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ బాలీవుడ్ లో చేస్తున్న సినిమా వార్2. హృతిక్ రోషన్ తో కలిసి చేస్తున్న సినిమా కావడంతో వార్2పై మంచి అంచనాలున్నాయి. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ స్పై థ్రిల్లర్ షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ లో రూపొందుతున్న వార్2 ను ఆగస్ట్ 15న రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ ఎప్పుడో అనౌన్స్ చేశారు. అయితే బాలీవుడ్ మీడియా వర్గాల సమాచారం ప్రకారం వార్2 ముందు చెప్పిన డేట్ కు రావడం లేదని తెలుస్తోంది. దానికి కారణం ఇంకా షూటింగ్ చాలా వరకు పెండింగ్ ఉండటమే అంటున్నారు. రిలీజ్ కు ఇంకా ఐదు నెలల టైమ్ ఉన్నప్పటికీ, అవుట్‌డోర్ షెడ్యూల్ ఇంకా చాలా ఉందట. దాన్ని పూర్తి చేయడంతో పాటూ కొన్ని సీన్స్ ను విదేశాల్లో షూట్ చేయాల్సి ఉందట. ంశ్రీబనీ ఖీవజీట – 'మజాకా' బ్యూటీ కోరికలు ఇలా ఉన్నాయ్! వీటన్నింటికీ చాలానే టైమ్ పడుతుంది కాబట్టి వార్2 ను వాయిదా వేయాలని చూస్తున్నారట మేకర్స్. ఈ విషయంలో ఇంకా ఎలాంటి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాలేదు కానీ వార్2 పోస్ట్ పోన్ విషయం మాత్రం బాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. ఇదిలా ఉంటే ఒకవేళ వార్2 నిజంగా వాయిదా పడితే ఆ డేట్ ను వాడుకోవడానికి పలు సినిమాలు రెడీగా ఉన్నాయి. ఆమిర్ ఖాన్ సొంత బ్యానర్ లో తెరకెక్కుతున్న లాహోర్ 1947ని అదే డేట్ కు తీసుకురావాలని చూస్తున్నారట. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ వీలైనంత త్వరగా వార్2 షూటింగ్ ను ఫినిష్ చేసుకుని ఫ్రీ అయిపోవాలని చూస్తున్నాడు. మార్చి నుంచి నీల్ సినిమా సెట్స్ లో జాయిన్ కానున్న తారక్, ఆ సినిమా తర్వాత దేవర2ను చేయనున్నాడు.



# ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత

### జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేయించండి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు(విజయ సారథి): ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుందని, జిల్లాలో ఉన్న అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.. గురువారం ఉదయం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ అంశంపై కార్మిక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పరిశ్రమల శాఖ, మత్స్య శాఖ, డిఆర్డిఏ, మెప్మా, డ్వామా, వ్యవసాయ, ఐసిడిఎస్ శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓ లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు అవసరమైన సమయాల్లో ఆసరా గా నిలుస్తుందన్నారు.. ఈ-శ్రమ్ పోర్టల్లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతతో పాటు వివిధ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.. అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికులకు యాక్సిడెంట్ లేదా మరణాలు సంభవించినప్పుడు, అసహాయ పరిస్థితుల్లో ఉన్న వారి కుటుంబ సభ్యులకు ఈ-శ్రమ్ కార్డు తగిన సాయం అందించే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు..ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రమాదాలు జరిగినపుడు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద, మరణ, అంగవైకల్య బీమా ఉచితంగా లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.. కాబట్టి అసంఘటిత రంగ కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు..16 నుండి 59 సంవత్సరాల వయస్సు లోపు ఉన్నవారు, ఇన్కమ్ టాక్స్ పరిధిలోకి రానివారు, ఈఎస్ఐ, ఈపిఎఫ్ సదుపాయం లేని అసంఘటిత కార్మికులు అందరూ నమోదుకు అర్హులని, ఉచితంగా ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు..వ్యవసాయ మరియు అనుబంధ శాఖల్లో ఉన్న ఉపాధి పనుల వారు, చిన్న, సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలలో పనిచేసే వారు, పాడి పరిశ్రమలో పనిచేసే కార్మికులు, మత్స్య కార్మికులు, తాపీ మేస్త్రీలు, రాళ్లు కొట్టేవారు, సెంట్రింగ్, ప్లంబింగ్, పెయింటర్, ఎలక్ట్రీషన్, వెల్డింగ్, ఉపాధి వర్కర్లు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు, మిడ్ డే మిల్ వర్కర్లు, తదితరులందరూ అసంఘటిత రంగ కార్మికుల కిందకు వస్తారని కలెక్టర్ తెలిపారు.. అలాగే ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న వారిని, ఆశా వర్కర్లను, స్వయం సహాయక సంఘాల సభ్యులను, ఫిషర్మెన్ అసోసియేషన్ వారితో మాట్లాడి మత్స్య కార్మికులను, ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్లో లో డ్రైవర్లు, ఆటో డ్రైవర్ లు, పారిశుధ్య కార్మికులు, చిన్న, సన్న కారు రైతులను, అంగన్వాడి హెల్పర్, ఆయా లను, జల వనరుల శాఖ కాంట్రాక్ట్ లేబర్, చేనేత, కమ్మరి, కుమ్మరి కార్మికులు, మిడ్ డే మిల్ వర్కర్లను, ప్రైవేట్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ స్టాఫ్, బ్యూటీ పార్లర్ లో పనిచేసే వారిని, హమాలీలను అందరినీ ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు... గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వీరిని నమోదు చేయించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను, ఎంపిడిఓ లను, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు... అసంఘటిత రంగ కార్మికులందరికీ సాయం చేస్తున్నామనే భావంతో ఈ అంశాన్ని ఛాలెంజ్ గా తీసుకొని ప్రతి ఒక్కరిని ఈ శ్రమ్ పోర్టల్ లో నమోదు చేయించాలన్నారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించాలని కలెక్టర్ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ను ఆదేశించారు .. వచ్చే సమావేశం నుండి నిర్దేశించిన లక్ష్యాల వారిగా పురోగతిపై సమీక్ష చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.. టెలి కాన్ఫరెన్స్ లో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో ఘనంగా శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు



పిఠాపురం(విజయ సారథి): కాకినాడ జిల్లా పిఠాపురం శ్రీ ఉమా కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం మరియు పాదగయ్ క్షేత్రం లో ఈనెల 26వ తేదీ బుధవారం మహాశివరాత్రి మరియు వార్షిక కళ్యాణం సందర్భంగా ఐదు రోజులపాటు ఉత్సవాల నిర్వహణ కోసం ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామని సహాయక కమిషనర్ మరియు కార్యనిర్వనాధికారి కట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 24వ తేదీ సోమవారం మొదలుకొని 28వ తేదీ శుక్రవారం వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి పురస్కరించుకొని పిఠాపురం పోలీస్ అధికారులు, మున్సిపాలిటీ, రెవిన్యూ అధికారుల సహకారాలతో వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు. శివరాత్రి ముందు రోజు మంగళవారం రాత్రి నుండి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా శివరాత్రి రోజున భక్తులకు మంచినీరు, చిన్నపిల్లలకు పాలు మరియు ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు అన్యాయమే : డొనాల్డ్ ట్రంప్



వాషింటోన్ ఫిబ్రవరి 20అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రికల్ వాహనాల తయారీ కంపెనీ టెస్లా (౧వబశ్రీజీ) భారత్ మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో భారత్‌లోకి టెస్లా ప్రవేశించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఈ మేరకు మస్క్ నిర్ణయాన్ని ఆయన వ్యతిరేకిస్తూ.. ఇది అన్యాయమే అంటూ వ్యాఖ్యానించారు. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తో సమావేశమైన రోజుల వ్యవధిలోనే టెస్లా సంస్థ భారత్‌లో ఉద్యోగ నియామకాలు చేపట్టింది. దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబై నగరాల్లో రెండు షోరూమ్‌లు ఏర్పాటు చేసేందుకు కూడా ప్రయత్నాలు మొదలు పెట్టింది. కాగా, ఎలాన్ మస్క్‌తో కలిసి ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఈ ప్రపంచంలోని ప్రతీ దేశం తమను వాడుకోవాలని ప్రయత్నిస్తోందని వ్యాఖ్యానించారు. సుంకాలతో లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మస్క్ భారత్‌లో టెస్లా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడానికి రెడీ అవుతున్నారని.. ఆయన వరకు అది మంచి విషయమే కావొచ్చన్నారు. కానీ, అమెరికా పరంగా చూస్తే మస్క్ నిర్ణయం చాలా అన్యాయమే అవుతుందని వ్యాఖ్యానించారు. మస్క్ ముందే ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇక ఇదే ఇంటర్వ్యూలో గత వారం ప్రధాని మోదీతో భేటీ విషయాన్ని ట్రంప్ ప్రస్తావించారు. ఈ మీటింగ్‌లో విద్యుత్ కార్లపై అధిక పన్నుల విషయాన్ని మోదీ తన వద్ద ప్రస్తావించినట్లు ట్రంప్ చెప్పారు. ట్యాక్సుల సమస్యను పరిష్కరించుకోవడంతో పాటు వీలైనంత త్వరగా వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఇరు దేశాలు కలిసి పని చేసేలా నిర్ణయించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు.

## జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లాలో ఎక్కడా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకూడదు

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(విజయ సారథి): మార్చి 1వ తేది నుండి 20వ తేది వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఇందుకు సంబంధించి జిల్లాలో ఎక్కడా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సంబధిత అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్ లు,మండల స్పెషల్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1వ తేది నుండి మార్చి 20వ తేది వరకు 69 సెంటర్ల లో 45,325 (మొదటి సంవత్సరం 23,098, రెండవ సంవత్సరం 22227) మంది విద్యార్థులు హాజరు అవుతున్నారన్నారు..ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు..ప్రశ్నా పత్రాల భద్రతకు ఆర్మ్డ్ గార్డ్స్ ఏర్పాటు తో పాటు పరీక్ష కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.. ప్రశ్నా పత్రాలు స్టోరేజ్ పాయింట్ నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే వరకు పోలీసు ఎస్కార్ట్ ఉండాలన్నారు.రెవెన్యూ, పోలీస్, విద్యా శాఖ అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్స్ టీములను నియామకం చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని కలెక్టర్ డిఆర్వో ను ఆదేశించారు..రేపు సాయంత్రం లోపు ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ ను ఆదేశించారు.. పరీక్ష కేంద్రాల్లో ప్రతి ఎగ్జామినేషన్ హాల్ లో త్రాగు నీరు ఏర్పాటు చేయాలన్నారు.. పరీక్ష కేంద్రాల్లో సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.. మండల స్పెషల్ ఆఫీసర్లు రెండు మూడు రోజుల్లోపు తమ పరిధిలోని అన్ని కేంద్రాలను తనిఖీ చేసి ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి నివేదికను ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.. కేంద్రాల వద్ద పరిశుభ్రత ఉండేలా సంబంధిత మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ చర్యలు తీసుకోవాలన్నారు..ఫస్ట్ ఎయిడ్ కిట్స్, అవసరమైన మందులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్ వో ను ఆదేశించారు..పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ ఆర్ఎం ను ఆదేశించారు.పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ ని ఆదేశించారు.గత పరీక్షల నిర్వహణ సందర్భంగా జరిగిన సంఘటనలను బట్టి, 7 సెంటర్లలో సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడం జరిగిందని, ఆయా సెంటర్ల లో ఎలాంటి సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీఫ్ సూపరింటెండెంట్ లను ఆదేశించారు.. అలాగే సిటింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు..సమావేశంలో అడిషనల్ ఎస్పీ, డిఆర్వో, ఆర్ ఐ ఒ, డిఎంఎచ్వో, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ ఈ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రమాణ స్వీకార వేదికపై.. ఆప్ ఎంపీ స్వాతి మలివాల్



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని రాంలీలా మైదానంలో బీజేపీ నాయకురాలు రేఖా గుప్తా కొత్త సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ స్వాతి మలివాల్ ఈ వేదికపై ప్రధాన ఆకర్షణగా నిలిచారు. కాంగ్రెస్ ఢిల్లీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్‌తో ఆసక్తిగా ఆమె మాట్లాడుతున్నట్లు కనిపించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, ఆప్ చీఫ్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు ఒకప్పుడు సన్నిహితురాలిగా ఉన్న స్వాతి మలివాల్ గత కొన్ని నెలలుగా ఆయనను తీవ్రంగా విమర్శించే వారిలో ఒకరిగా ఎదిగారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు అరవింద్ కేజ్రీవాల్‌పై ఆమె తీవ్రంగా మండిపడ్డారు. యమునా నదిని శుభ్రం చేయడంలో విఫలమైనందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ నివాసం వద్ద నిరసన కూడా చేపట్టారు. గత ఏడాది మే నెలలో కేజ్రీవాల్ నివాసంలో ఆయన సహాయకుడు బిభవ్ కుమార్ తనపై దాడి చేసినట్లు ఆమె ఫిర్యాదు

## మోసం కేసు.. మహారాష్ట్ర మంత్రికి రెండేండ్ల జైలు శిక్ష

30 ఏండ్ల కిందటి మోసం కేసు లో మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావ్ కొకటే దోషిగా తేలారు. దీంతో నాసిక్ జిల్లా కోర్టు మంత్రికి రెండేండ్లు జైలు శిక్ష విధించింది. అంతేకాదు రూ.50 వేల జరిమానా కూడా వేసింది. మంత్రితోపాటు ఆయన సోదరుడు సునీల్ కొకటేని కూడా కోర్టు దోషిగా తేల్చింది.కాగా, నిర్మాణ్ వ్యూ అపార్ట్‌మెంట్ లో ముఖ్యమంత్రి కోటా కింద కొకాటే సోదరులు రెండు ఫ్లాట్‌లను పొందారనే ఆరోపణలు ఉన్నాయి. డాక్యుమెంట్ ట్యాంపరింగ్ చేసి ఆ ఫ్లాట్స్‌ను దక్కించుకున్నారని, ప్రయోజనాలను చట్టవిరుద్ధంగా పొందేందుకు నకిలీ పత్రాలను సృష్టించారని ఆరోపిస్తూ మాజీ మంత్రి తుకారాం డిఘోలే 1995లో కొకాటే సోదరులపై కేసు పెట్టారు. దీనిపై విచారణ జరిపిన నాసిక్ జిల్లా సెషన్స్ కోర్టు కొకాటే సోదరులను దోషిగా తేల్చింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న మరో ఇద్దరిని నిర్దోషులుగా విడుదల చేసింది. అయితే, శిక్ష పడిన వెంటనే ఆయనకు బెయిల్ మంజూరైంది. కోర్టు ఉత్తర్వులపై అప్పీల్‌కు వెళ్లనున్నట్లు మంత్రి విలేకరులతో తెలిపారు.

# ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి

### ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి

### మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



హైదరాబాద్ ఫిబ్రవరి 20, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, ఆంధ్రప్రదేశ్ చేస్తున్న జల దోపిడీని అడ్డుకోవాలి అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. రేవంత్ సర్కారుకి చేతకాకపోతే మేము వస్తాం.. ఢిల్లీకి పోదాం. ధర్నా చేద్దాం.. పదండి అని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.రాష్ట్ర సాగు, తాగు నీటి ప్రయోజనాలకు తీవ్ర నష్టం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. సోయి లేని ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ఎంత నష్టం జరుగుతుందో అర్థం అవుతోంది. నీళ్ల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నీళ్లు నములుతున్నారు. బీఆర్ఎస్ తెలంగాణ భూములకు నీరు పారిస్తే? కాంగ్రెస్ నీళ్లు నములుతోంది. సాగర్ కుడి కాల్వ నుంచి రోజూ పది వేల క్యూసెక్కులు మూడు నెలలుగా పోతున్నా పట్టించుకోవడం లేదు. తాత్కాలిక వాటా అయినా 512 టీఎంసీలకు మించి 657 టీఎంసీలు తీసుకుపోయింది. 25 రోజుల్లోనే 65 టీఎంసీల నీటిని తరలించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టవా? ప్రభుత్వ నిర్లక్ష్యం తెలంగాణకు పెనుశాపంగా మారింది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది? ఇప్పటికైనా కళ్లు తెరవాలి..నాగార్జున సాగర్ కేంద్ర బలగాల చేతిలో ఉన్నప్పటికీ కేంద్రం అనుమతి లేకుండా ఏపీ ఇష్టారీతిన నీటిని తరలించుకుపోతోంది. కేంద్రాన్ని అడిగే ధైర్యం లేదు, చంద్రబాబును అడిగే దమ్ము లేదు. ప్రతిపక్షాలను బాగా విమర్శిస్తారు? కానీ, కేంద్రాన్ని అడిగే పరిస్థితి లేదు. శ్రీశైలం, సాగర్ నీటిని తరలించుకుపోతుంటే కనీసం స్పందించడం లేదు. 1015 టీఎంసీల నీరు కృష్ణాలో ఈ ఏడాది వచ్చింది. ఏపీకి కేవలం 9 టీఎంసీల హక్కు మాత్రం ఉంది? ఇవాళ కూడా ఏపీకి నీరు తరలిస్తూనే ఉన్నారు. 220 టీఎంసీలు మాత్రమే తెలంగాణ వాడుకుంది? ఇంకా 123 టీఎంసీలు రావాలి. తెలంగాణ ఇప్పటికే నష్టపోయింది? ఇప్పటికైనా కళ్లు తెరవాలి అని హరీశ్‌రావు సూచించారు.యాసంగి పంట కింద ఎన్ని ఎకరాలకు నీరు ఇస్తారో ప్రభుత్వం ప్రకటనలు ఇచ్చింది. ఆరున్నర లక్షల ఎకరాల్లో రైతులు పంటలు ఏసుకున్నారు, సాగర్ ఎడమకాల్వకు ఇంకా నాలుగు తడులు కావాలి. హైదరాబాద్ సహా చాలా జిల్లాల తాగునీటి అవసరాలు ఉన్నాయి. ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడి ఏపీకి నీరు ఆపేలా చూడండి. కృష్ణా బోర్డు కార్యాలయం ముందు, దిల్లీలో ధర్నా చేద్దాం? మేమూ వస్తాం. సాగర్ కుడి కాల్వ, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి నీరు వెళ్లకుండా అడ్డుకోవాలి. నీటి తరలింపు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం. రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది కాబట్టే? ఏపీ ఇష్టం వచ్చినట్లు నీటిని తరలించుకుపోతోంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ ప్రభుత్వం లేనందువల్ల, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉన్నందువల్ల నీటిని తరలించుకునేందుకు చంద్రబాబుకు సులువు అయింది. ఇష్టం వచ్చినట్లు జలదోపిడీ జరుగుతోంది, ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి పరోక్షంగా సహకరిస్తున్నారు. ఈ ఏడాది ఇవాల్టి వరకు కృష్ణా బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశం జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించలేదు. కృష్ణా బోర్డు కేంద్రం నియంత్రణలో ఉందా? ఏపీ నియంత్రణలో ఉందా? అన్న అనుమానం కలుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. నీటిని తరలించుకుపోతుంటే శిలావిగ్రహాల్లా చూస్తున్నారు. అవసరమైతే అఖిల పక్షాన్ని దిల్లీకి తీసుకెళ్ళి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. బీజేపీ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఉండి ఏం లాభం? కేంద్ర మంత్రిగా ఉండి నీళ్ళు తెస్తారా? చంద్రబాబుకు వత్తాసు పలుకుతారా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.ప్రధాని, కేంద్ర జలవ నరుల శాఖ మంత్రి ఇంటి ముందు ధర్నా చేద్దాం. రాష్ట్రం కోసం ఉపయోగపడని పదవులు ఎందుకు? సందర్భాన్ని బట్టి స్పందించాలి. నాగార్జున సాగర్ నుంచి సీఆర్పీఎఫ్ బలగాలు ఉపసంహరించాలి, లేదంటే శ్రీశైలంలో కూడా పెట్టాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుట్వానికి చేత కావడం లేదు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ చూపి తెలంగాణ ప్రయోజనాలు కాపాడేలా చూడాలి. ప్రాజెక్టులకు అనుమతులు తేవడంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. 15 నెలలు అయినా ప్రాజెక్టులకు అనుమతులు తేవాల్సింది? డీపీఆర్‌లు వెనక్కు వచ్చినా పట్టించుకోవడం లేదు. ఉద్దేశపూర్వకంగా మేడిగడ్డను పండబెట్టారు, ఆర్నెళ్లలో మరమ్మత్తులు పూర్తి చేసే అవకాశం ఉన్నా చేయడం లేదు.

## మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం(విజయ సారథి):మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు రెండవ నాడైన గురువారం శ్రీ స్వామి అమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.తరువాత యాగశాల యందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేయబడ్డాయి.అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి.అదే విధముగా ఈ సాయంకాలం ప్రదోష కాలపూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు జరిపించబడుతాయి.భృంగి వాహనసేవఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగా ఈ రోజు ॥20.02.2025) సాయంకాలం శ్రీ స్వామి అమ్మవార్లకు భృంగివాహనసేవ జరిపించబడుతుంది.ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడుతాయి. తరువాత శ్రీశైలక్షేత్ర ప్రధాన వీధులలో గ్రామోత్సవం జరుగనున్నది.గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంబాయ్ డోల్ థేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్రడోలు కునిత, జాంజ్ పథక్ ( కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గొరవనృత్యం, బుట్టబొమ్మలు, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి.

## గ్రూప్-2 పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్


అనంతపురం/బుక్కరాయసముద్రం(విజయ సారథి):ఈనెల 23వ తేదీన ఆదివారం నిర్వహించే ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. గురువారం బుక్కరాయసముద్రం మండలంలోని శ్రీనివాస రామానుజన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్ఆర్ఐటి) కళాశాలలో ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు నిర్వహించే తరగతి గదులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.×- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఆర్ఐటి కళాశాలలో ఏపీపీఎస్సీ, గ్రూప్-2 పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతపురం నుంచి ఎస్ఆర్ఐటి కళాశాలకు పరీక్ష జరిగే రోజు అభ్యర్థుల సౌకర్యార్థం అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో అభ్యర్థి బుక్లెట్ సంబంధిత అభ్యర్థికే వెళ్లేలా చూసుకోవాలన్నారు. కళాశాల వద్ద ఎక్కువ టీంలను ఏర్పాటు చేసుకొని ఫ్రిస్కింగ్ జాగ్రత్తగా చేయాలని, పరీక్షలను మండల తహసిల్దార్ మానిటర్ చేయాలన్నారు. కళాశాలలోని సీసీటీవీ కెమెరాలు అన్ని పనిచేసేలా చూడాలని, ఇక్కడి నుంచి సీసీటీవీల ఫీడ్ కలెక్టరేట్ కూడా అందించాలన్నారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ పరీక్షలు జరిగే మిగతా వెన్యూ కేంద్రాలను కూడా తనిఖీ చేయాలని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కళాశాలలోని స్ట్రాంగ్ రూంని జిల్లా కలెక్టర్ పరిశీలన చేశారు.- ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ ఎస్.ఎన్. షరీఫ్, ఎస్ఓ శంకర్ రావు, ఎస్ఆర్ఐటి గ్రూప్ 2 పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ జి.బాలకృష్ణ, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ యు.శ్రీనివాస్, తహసిల్దార్ పుణ్యవతి, ఎస్ఐ శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

నంద్యాల/గోస్పాడు(విజయ సారథి): మండల కేంద్రంలో ని ఏపీ మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, తరగతి గదులను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆర్ఓ ప్లాంట్లో లీకేజీ సమస్యను గుర్తించి మరమ్మతులు చేయించాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పుస్తకాలు, కుర్చీలు, ర్యాక్లు వంటి లైబ్రరీ సామాగ్రి తప్ప ఎటువంటి వస్తువులు ఉంచకూడదన్నారు. పాఠశాలలో ఇంకా మిగిలిపోయిన స్కూల్ బ్యాగులను పరిశీలిస్తూ పాఠశాలకు ఎన్ని సంచులు ఇండెంట్ చేయబడ్డాయి? ఎన్ని సంచులు పంపిణీ చేయబడ్డాయి? ఎన్ని సంచులు మిగిలి ఉన్నాయి? సంచులు ఎందుకు ఎక్కువగా ఇండెంట్ చేయబడ్డాయి? వీటిపై సవివరమైన నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్లో రైటింగ్ ప్యాడ్ లేకుండా కుర్చీలను ఉపయోగించే విద్యార్థులతో పరీక్ష నిర్వహించే అంశంపై నివేదిక ఇవ్వాలన్నారు. పాఠశాలలోని ల్యాబ్ గదులన్నింటికీ తాళాలు వేయకుండా వాటిని క్రమం తప్పకుండా వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలోని వైద్యశాలతో పాటు మెట్ల పక్కన గదులను శుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో చెల్లాచెదురుగా వున్న ఐఎఫ్పి బాక్స్లను శుభ్రం చేయడంతో పాటు ఆవరణను చక్కగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### టి లింగం దిన్నె గ్రామంలో రెండవ రోజు పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

. రుద్రవరం.ఫిబ్రవరి 20 :మండలంలోని టి లింగం దిన్నె గ్రామంలో ఉత్సవ మూర్తులకు గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



అహోబిల లక్ష్మీనరసింహస్వామి పార్వేట ఉత్సవాలలో భాగంగా ఉత్సవ పల్లకి తిప్పారెడ్డిపల్లి గ్రామం నుంచి గ్రామ సమీపంలోకి రాగానే గ్రామ పెద్దలు ఎదురుగా వెళ్లి మంగళ వాయిద్యాలతో గ్రామంలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎంపిక చేసిన తెలుపులపై ఉత్సవమూర్తుల పల్లకిని కొలువు తీర్చి ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. పార్వేట ఉత్సవాలలో భాగంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

# ఏర్పాట్లను పరిశీలించిన దేవదాయశాఖ కార్యదర్శి



శ్రీశైలం(విజయ సారథి):మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను గురువారం రాష్ట్ర దేవదాయశాఖ కార్యదర్శి శ్రీ వాడరేవు వినయ్ చంద్ పరిశీలించారు.సర్వదర్శనం, శీఘ్ర, అతిశీఘ్రదర్శన క్యూలైన్లు, పాగాలంకరణ ఏర్పాట్లు, కల్యాణోత్సవ ఏర్పాట్లు మొదలైనవాటిని కార్యదర్శివారు పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల రద్దీకి తగినట్లుగా ఆయా ఏర్పాట్లు ఉండాలన్నారు..క్యూలైన్ల నిర్వహణ పూర్తి ప్రణాళికబద్దంగా ఉండాలన్నారు. ఉన్నతాధికారులు నిరంతరం క్యూలైన్ల నిర్వహణను పరిశీలిస్తుండాలన్నారు.క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు విధంగా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూకాంప్లెక్స్ వేచివుండే భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు క్రమం తప్పకుండా అందిస్తుండాలన్నారు. ముఖ్యంగా క్యూలైన్లలో ఎటువంటి తొక్కిసలాటలు లేకుండా ఉండేందుకు తగు విధంగా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా క్యూకాంప్లెక్సులో ప్రత్యేకంగా ప్రథమిచికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కేంద్రంలో ఆక్సిజన్ సిలిండర్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రథమచికిత్స కేంద్రం వద్ద నిరంతరం వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. క్యూలైన్లలో తగినంత మేరకు లైటింగు ఏర్పాట్లు ఉండాలన్నారు.క్షేత్రపరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవిధంగా తగు ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యంగా చెత్తచెదారాలు ఎప్పటికప్పుడు, తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అన్ని శౌచాలయాలు కూడా ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా తగు ఏర్పాట్లు ఉండాలన్నారు. శౌచాలయాల వద్ద నిరంతరం నీటిసరఫరా ఉండాలన్నారు. సిబ్బంది ఎప్పటికప్పుడు శౌచాలయాల శుభ్రతను పర్యవేక్షిస్తు ఉండాలన్నారు..క్షేత్ర పరిధిలో అవసరమైన అన్నిచోట్ల కూడా సమాచారబోర్డులు, సూచికబోర్డులు అధికసంఖ్యలో ఉండాలన్నారు.ఈ ఏర్పాట్ల పరిశీలనలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీ ఎస్.ఎస్.చంద్రశేఖరఆజాద్, కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగా చిత్తడి నేలలను గుర్తించాలి

### ఆక్రమణకు గురైన చిత్తడి నేలలను తొలగించేందుకు కృషి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్


అనంతపురం(విజయ సారథి):జిల్లాలో వీలైనంత త్వరగా చిత్తడి నేలలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి చిత్తడి నేలల పరిరక్షణ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఎఫ్ఓ విగ్నేష్ అప్పావుతో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు.×- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆక్రమణకు గురైన చిత్తడి నేలలను తొలగించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. చిత్తడి నేలలను గుర్తించేందుకు ప్రణాళిక రూపొందించాలని, ఫేస్-1లో పైలెట్ ప్రాతిపదికన మార్చి 10వ తేదీ నాటికి జిల్లాలో 15 గుర్తించదగిన చిత్తడి నేలల కోసం నోటిఫికేషన్ ప్రతిపాదనల తయారీ మరియు సమర్పణ చేయాలన్నారు. ఫేస్-2లో ఇంటిగ్రేటెడ్ మేనేజ్మెంట్ ప్లాన్ తయారీతో పాటు 10/05/2025 నాటికి జిల్లాలో మరో 100 నోటిఫికేషన్ ప్రతిపాదనల తయారీ మరియు సమర్పణ చేసేలా చూడాలని, 3వ దశలో ఇంటిగ్రేటెడ్ మేనేజ్మెంట్ ప్లాన్ తయారీతో పాటు 10/07/2025 నాటికి మన జిల్లాలో మిగిలిన నోటిఫికేషన్ ప్రతిపాదనల తయారీ మరియు సమర్పణ చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.- ఈ సందర్భంగా డిఎఫ్ఓ విగ్నేష్ అప్పావు మాట్లాడుతూ చిత్తడి నేలలను రక్షించడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. చిత్తడి నేలల (పరిరక్షణ మరియు నిర్వహణ) నియమం, 2017 యొక్క నిబంధనలను తెలిపారు. జిల్లాలో చిత్తడి నేలల గుర్తింపు, సరిహద్దులు, నోటిఫికేషన్ మరియు పరిరక్షణలో పాల్గొన్న ప్రక్రియను కూడా క్లుప్తంగా వివరించారు.- ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, డ్వామా పిడి సలీమ్ భాష, సర్వే ఏడి రూప్ల నాయక్, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్ బాబు, ఫిషరీష్ డిడి శ్రీనివాస నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా ఇంటర్ పరీక్షలు

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

### ఏపీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్షలు, ఇంటర్ పరీక్షలు, పి4 సర్వే, వాట్సప్ గవర్నెన్స్, ప్రజాస్పందనలపై.. అన్ని జిల్లాల కలెక్టర్లతో విసి ద్వారా సమీక్షించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్

కడప(విజయ సారథి): రానున్న ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు.గురువారం అమరావతి నుండి... గ్రూప్-2,ఇంటర్ పరీక్షలు,ఖ4 సర్వే, వాట్సాప్ గవర్నెన్స్, ప్రజాస్పందనలు, తదితర అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు.ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి.. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు.. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విసి ద్వారా..రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ మాట్లాడుతూ... గ్రూప్-2 పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లైజెన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరువైజర్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా జరిగేలా చూడాలని సూచించారు.అలాగే ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి ఇంటికి ప్రగతి అనే నినాదంతో నిర్వహించే పి4 సర్వే వచ్చే ఉగాది లోపల ప్లానింగ్,సచివాలయాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అగ్రికల్చర్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్లాట్ షిప్ కార్యక్రమాలు పథకాలపై ఐ వి ఆర్ ఎస్, క్యూఆర్ కోడ్ ల ద్వారా ప్రజల నుంచి ప్రజాస్పందనలు స్వీకరించాలన్నారు. ప్రజల చేతిలో ప్రభుత్వం (వాట్సాప్ గవర్నెన్స్)పై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 158 సేవలు అందిస్తున్నామని రానున్న కాలంలో మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్లు వీటిపై మరింత దృష్టి సారించాలన్నారు.సిఎస్ విసి ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...





ఇంటర్ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్నెట్, జెరాక్స్ సెంటర్లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లరాదన్నారు. పోలీసులు ముందుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్లు ఉండేలా అధికారులు చూసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఓ అజరతయ్య, జిల్లా పంచాయతీరాజ్ అధికారిని రాజ్యలక్ష్మి, డీఈవో శంషుద్దీన్, ఏపీపీఎస్సీ అధికారులు,విద్య శాఖ అధికారులు పోలీసు, ట్రాన్స్పోర్ట్ అధికారులు,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు విజయవంతం చేయండి:

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప(విజయ సారథి):ఈ నెల 23వ తేదీ న జరుగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీ ఏర్పాట్లతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాల్ నందు ఈ నెల 23వ తేదీ న జరుగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షల నిర్వహణ, ఏర్పాట్ల పై సంబంధిత లైజన్ అధికారులతో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ న జరుగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 సర్వీసెస్ మెయిన్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీ ఏర్పాట్లతో అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. పరీక్షలు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పార్ట్-1 సెషన్, మధ్యాహ్నం 3.00 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పార్ట్-2 సెషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 13 పరీక్షా కేంద్రాలలో రెండు సెషన్స్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు ఉదయం 8.30 గంటల నుండి 9.45 గంటల వరకు, 1.30 గంటల నుండి 2.45 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించవాలెనన్నారు. పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీసు కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపర్ వైజర్లు, పోలీస్ యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా, ఎలాంటి అక్రమాలకు తావ్వివకుండా జరిగేలా చూడాలని అన్నారు. పోలీస్ శాఖ ప్రతి పరీక్షా కేంద్రంలో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో త్రాగు నీటి వసతి, మరుగుదొడ్లు, అంతరాయలేని నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, పరిశు



భ్రంగా ఉంచాలని అన్నారు.కలెక్టర్ కార్యాలయం నందు గ్రూప్-2 మెయిన్ పరీక్షలకు సంబంధించి హెల్ప్ డెస్క్ 08562-246344 గల నంబరు 21-02-2025 నుండి 23-02-2025 వరకు కార్యాలయ సమయం ప్రకారం పరీక్షకు హాజరగు అభ్యర్థుల సహాయారార్థం ఏర్పాటు చేయవలసిందిగా తెలిపారు.జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు:-(1)కె ఎల్ ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్, బిసైడ్ కె ఎస్ ఆర్ ఎం కాలేజ్, కృష్ణాపురం, తాడిగొట్ల, చింతకొమ్మదిన్నె మండలం, కడప వైఎస్ఆర్ జిల్లా- 516005.(2)గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్(ఏ) (ఆర్ట్స్ కాలేజ్), బిసైడ్ న్యూ కలెక్టర్ ఆఫీస్, రిమ్స్ రోడ్, కడప వైఎస్ఆర్ జిల్లా- 516004.(3) కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ( ఆటోనమాస్), కృష్ణాపురం, చింతకొమ్మదిన్నె మండలం, కడప వైఎస్ఆర్ జిల్లా- 516005.(4)అన్నమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, బిహైండ్ ఆర్టీవో ఆఫీస్, ఊటుకూరు పోస్ట్, చింతకొమ్మదిన్నె విలేజ్ ఽ మండలం, వైఎస్ఆర్ జిల్లా- 516003.(5)గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ ఫర్ గర్ల్స్, నియర్ హెడ్ పోస్ట్ ఆఫీస్, కడప, వైఎస్ఆర్ జిల్లా- 516001.(6)శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (౹ాఎమెూ), పులివెందుల రోడ్, కృష్ణాపురం, నియర్ పెట్రోల్ బంక్ బ్యాక్ సైడ్ ఆఫ్ ఖాఖీఓ, తాడిగొట్ల గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం, కడప వైఎస్ఆర్ జిల్లా- 516004.(7)శ్రీహరి డిగ్రీ కాలేజ్, నియర్ తాలూకా పోలీస్ స్టేషన్, బాలాజీ నగర్, కడప, వైఎస్ ఆర్ జిల్లా - 516003.(8)శ్రీవెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నియర్ ఎస్ వి డిగ్రీ కాలేజ్, బాలాజీ నగర్, కడప, వైఎస్ ఆర్ జిల్లా - 516003.(9)నారాయణ జూనియర్ కాలేజ్, డోర్ నెం. 2/714-18, హరి టవర్స్, నాగరాజు పేట, ఆఫీసర్స్ క్లబ్ ఎదురుగా, నియర్ కోటిరెడ్డి సిర్కిల్, కడప వైఎస్ ఆర్ జిల్లా - 516001.(10)ఎస్ కె ఆర్ అండ్ ఎస్ కె ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, నియర్ సన్ రైజ్ హాస్పిటల్, నాగరాజు పేట, కడప వైఎన్ ఆర్ జిల్లా - 516001.(11)నాగార్జున డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, డోర్ నెం. 39/622-68, ఆర్టీసీ బస్ స్టాండ్ ఎదురుగా - ఔట్ గేట్, 13వ వార్డు, అరవింద నగర్, కడప వైఎస్ ఆర్ జిల్లా - 516001.(12)శ్రీ వివేకానంద డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్, (ఆటోనోమాస్), నియర్ వై జంక్షన్, పక్కీర్ పల్లి రోడ్, కడప వైఎస్ ఆర్ జిల్లా - 516002.(13)కె ఓ ఆర్ ఎం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నియర్ కె.ఎస్. ఆర్. ఎం. జాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కృష్ణాపురం, చింతకొమ్మదిన్నె మండలం, కడప వైఎస్ఆర్ జిల్లా- 516005.ఈ సమావేశం లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ ఇ జి అశోక్ కుమార్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఏపీపీఎస్సీ ప్రత్యేక అధికారులైన పర్యవేక్షకులు కె. శారద, అసిస్టెంట్ సెక్రెటరీ (మానిటోరింగ్) జె. జయంతి, ఎస్వో జె. యశోద, సునీత, జిల్లా అధికారులు, లైజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### శ్రీస్వామి వారి నిత్య అన్నదాన పథకమునకు రూ.10 లక్షల రూపాయలు విరాళము

కదిరి(విజయ సారథి):శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము అధ్వరములో నిర్వహించే శ్రీస్వామి వారి నిత్య అన్నదాన పథకానికి కర్నాటక రాష్ట్రం, బెంగళూరు సిటి, మార్తహళ్ళి వాస్తవ్యులు అయిన శ్రీ.యం.రమేష్ రెడ్డి, శ్రీమతి.చంద్రిక కుటుంబ సభ్యులు వారు నేడు 20.02.2025 వతేది గురువారము రూ.10,00,000/--లను విరాళముగా సమర్పించియున్నారు. దాతను ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అభినందిస్తూ దాతలకు శ్రీస్వామి అమ్మవార్ల ఆలయములలో ప్రత్యేక పూజలు చేయించి శ్రీస్వామి వారి చిత్ర పటము, శేషవస్త్రము, ప్రసాదము ఇవ్వడమైనది.



PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com